విశాలాంధ్ర

కృష్ణా, ఎన్టీఆర్
గుంటూరు, పల్నాడు

మంగళవారం 29 ఏప్రిల్ 2025 8 పేజీలు

వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు ప్రాధాన్యత

- బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దు
- స్వచ్ఛతపై త్వరలో రూట్ మ్యాప్..
- రాష్ట్రంలో ప్రతి మూడో శనివారం స్వచ్ఛాంధ్ర
- పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ

విశాలాంధ్ర-విజయవాడ: వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు పంచాయతీ, పురపాలక సంఘాలు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో కెపాసిటీ బిల్డింగ్, బిహేవియరల్ చేంజ్ పై సోమవారం ఒక రోజు వర్క్ షాప్ విజయవాడ నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వర్క్ షాప్‌కు హాజరైన మంత్రి నారాయణ మాట్లాడుతూ ప్రతి రోజూ 6,500 టన్నుల సాలిడ్ వేస్ట్ వస్తుందన్నారు. గత ప్రభుత్వం 80 లక్షల టన్నుల చెత్తను వదిలివెళ్లిందని, సీఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ఈ ఏడాది అక్టోబర్ 2 లోపు చెత్తనంతా తొలగించాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నామన్నారు. మున్సిపాలిటీల్లో సాలిడ్ వేస్ట్, లిక్విడ్ వేస్ట్ తొలగించడం ఎంతో సవాల్ తో కూడుకున్నదని, నాలుగు థీమ్ లు గా పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నామని, వాటిని క్రమబద్ధంగా -మిగతా 2లో...

కూటమికే గుంటూరు పీఠం

- నగరపాలక సంస్థ 7వ మేయర్‌గా కోవెలమూడి రవీంద్ర
- 61 మంది హాజరు
- టీడీపీ అభ్యర్థికి 34, వైసీపీ అభ్యర్థికి 27
- టీడీపీ అభ్యర్థి విజయం.. అభినందనల వెల్లువ

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు నగర పాలక సంస్థ మేయర్ పీఠాన్ని కూటమి దక్కించుకుంది. నగరపాలక సంస్థ 7వ మేయర్‌గా టీడీపీ నుంచి కోవెలమూడి రవీంద్ర (34 ఓట్లు) ఎన్నికయ్యారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సోమవారం ప్రిసైడింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ తేజ ఆధ్వర్యంలో గుంటూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు మేయర్ ఎన్నిక నిర్వహించారు. ఎన్నికల ప్రత్యేక సమావేశంకు ఎక్స్‌అఫీషియో సభ్యులు కేంద్ర మంత్రి, గుంటూరు ఎంపీ డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్సీలు చంద్రగిరి ఏసురత్నం, లేళ్ల అప్పిరెడ్డి, ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, డాక్టర్ బూర్ల రామాంజనేయులు, గళ్లా మాధవి, కార్పొరేటర్లు హాజరయ్యారు. సమావేశంకు 61 మంది హాజరవ్వగా, కోరం ఉన్నందున ప్రిసైడింగ్ అధికారి మేయర్ ఎన్నికకు సంబంధించి టీడీపీ -మిగతా 2లో...

ప్రధాని పర్యటన విజయవంతం చేయాలి : మంత్రి గొట్టిపాటి

విశాలాంధ్ర-మంగళగిరి: అమరావతి రాజధాని పనుల పునఃప్రారంభానికి మే 2న రాష్ట్రానికి ప్రధాని నరేంద్ర మోదీ వస్తున్నారని, ఆ పర్యటనను కూటమి నాయకులు విజయవంతం చేయాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పిలుపునిచ్చారు. సోమవారం టీడీపీ కార్యాలయం ఎమ్మెస్సెస్ భవన్‌లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణ సమీక్షా సమావేశం నిర్వహించారు. జనసమీకరణ, వాహనాల ఏర్పాటు తదితర అంశాలపై సమీక్షించారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు బాధ్యతగా భావిస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. గతంలో మోదీ పర్యటనలకు మించి విజయవంతం చేయడానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ పాలక మండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, ఏపీ పద్మశాలీ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పంచుమర్తి ప్రసాద్(చిన్న) నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ, మంగళగిరి మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్, దుగ్గిరాల మండల పార్టీ అధ్యక్షులు కేసంనేని శ్రీఅనిత, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, జనసేన ఎంటీఎంసీ -మిగతా 2లో...

అందరికీ పింఛన్లు ఇవ్వాలి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు నగరపాలక సంస్థలో రిటైర్డ్ అయిన కార్మికులందరికీ పెన్షన్ అందేలా చర్యలు తీసుకోవాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి కోట మాల్యాద్రి నగరపాలక సంస్థ అధికారులు, కాంట్రాక్టర్లను కోరారు. నగరపాలక సంస్థలో పనిచేస్తూ 60 సంవత్సరాలు నిండిన కారణంగా విధుల నుంచి నిలుపుదల చేసిన ఆప్కాస్ కార్మికుల సమావేశం గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లోని వీఎస్‌కే హాలులో సోమవారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన కోట మాల్యాద్రి మాట్లాడుతూ రిటైర్డ్ కార్మికులకు రావలసిన పీఎఫ్ తదితరాలను వారికి అందే వరకు అవసరమైన సహకారం యూనియన్ నుంచి ఎప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. పదవీ విరమణ వయస్సు 62 నుంచి 60కు తగ్గించడం దుర్మార్గమని, ఒక పక్క పర్మినెంట్ కార్మికులను 62 సంవత్సరాలుగా పనిచేస్తూ ఉండగా మరొకపక్క ఆప్కాస్ వర్కర్లను 60కి -మిగతా 2లో...

ఏపీపీఎస్సీ మెయిన్స్ షెడ్యూల్ మార్చాలి

కలెక్టర్ లక్ష్మీశకు ఏఐవైఎఫ్ వినతి

విశాలాంధ్ర-విజయవాడ: వచ్చే నెల మొదటి వారంలో జరగనున్న ఏపీపీఎస్సీ మెయిన్స్ పరీక్షల షెడ్యూలును మార్చాలని నిరుద్యోగ పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్, ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకులు లంకా గోవిందరాజులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ లక్ష్మీశకు వినతిపత్రం అందజేశారు. యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థులపై విద్యాపరమైన, భావోద్వేగ ఒత్తిడిని ప్రభుత్వం దృష్టిలో ఉంచుకోవాలన్నారు. అధికారిక యూపీఎస్సీ క్యాలెండర్ ప్రకారం, ప్రిలిమినరీ పరీక్ష మే 25న, మెయిన్ పరీక్ష ఆగస్టు చివరి వారంలో నిర్వహిస్తారని తెలిపారు. ఏపీపీఎస్సీ గ్రూప్1 మెయిన్స్ కోసం సిద్ధమవుతున్న అభ్యర్థుల్లో చాలా మంది సివిల్ సర్వీసెస్ పరీక్షపై దృష్టి పెడతారన్నారు. ఈ సమయంలో ఏపీపీఎస్సీ మెయిన్స్, యూపీఎస్సీ ప్రిలిమ్స్ మధ్య 15 రోజుల వ్యత్యాసం ఉందన్నారు. ఈ రెండు పరీక్షలకు సిలబస్ విభిన్నంగా ఉంటుందని, అతి తక్కువ సమయంలో అటు ఏపీపీఎస్సీ, ఇటు యూపీఎస్సీ పరీక్షలకు పోటీపడటం చాలా అరుదైన విషయమని చెప్పారు. ఏపీపీఎస్సీ మెయిన్స్ పరీక్ష విశ్లేషణాత్మక రచన, వివరణాత్మక కంటెంట్, చరిత్ర, భౌగోళికం, ఆర్థిక వ్యవస్థ, రాజకీయాలు, కరెంట్ అఫైర్స్ ఆంధ్రప్రదేశ్-నిర్దిష్ట విషయాలతో లోతైన అవగాహనతో రూపొందిస్తారన్నారు. దీనికి విరుద్ధంగా యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్షకు బహుళ ఎంపిక ప్రశ్నలు (ఎంసీక్యూస్), సమయ నిర్వహణ, ఆబ్జెక్టివ్-శైలి తయారీకి సంబంధించిన స్థిరమైన అభ్యాసం అవసరమన్నారు. ఇది విద్యా ఒత్తిడి, పనితీరు క్షీణతను పరిశీలిస్తుందని తెలిపారు. ఫార్మాట్లలో వ్యత్యాసం, పరీక్షల మధ్య తక్కువ అంతరం కారణంగా, విద్యార్థులు అధిక ఒత్తిడిని ఎదుర్కొంటారని అన్నారు. యూపీఎస్సీ ప్రిలిమ్స్ జాతీయ పరిధిలో -మిగతా 2లో...

ముఠా కార్మికుల సంక్షేమానికి సమగ్ర చట్టం చేయాలి-2

తాగునీరు ఇవ్వండి మహాప్రభో?-3

(మొదటి పేజీ తరువాయి)

వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు ప్రాధాన్యత

అమలు చేసి దేశంలోనే మన రాష్ట్రం మొదటి స్థానంలో నిలిచేలా కృషి చేస్తామని మంత్రి అన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించే చర్యలను ఏ మేరకు సమర్థవంతంగా అమలు చేశామన్నది అన్నింటికన్నా ముఖ్యమైనదిగా పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రతి మూడో శనివారం స్వచ్ఛాంధ్ర నిర్వహిస్తున్నారని, దీంతో ప్రజల్లో చెత్త నిర్వహణపై అవగాహన పెరిగిందన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి మాట్లాడుతూ వేస్ట్ మేనేజ్ మెంట్ లో మన రాష్ట్రం అగ్రగామిగా నిలవాలంటే రాష్ట్రం లో ఉన్న ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు. గత నెల యూరోప్ పర్యటన సందర్భంగా 8 కంట్రీస్ లో ముఖ్యంగా గమనించింది, వారి జీవన శైలిలో స్వచ్ఛతపై ప్రజల్లో ఉన్న అవగాహన అమోఘమన్నారు. అక్కడి ప్రజలు సైతం ప్లాస్టిక్ బిన్ లో ప్లాస్టిక్, పేపర్ బిన్ లో పేపర్ ఇలా వాటికి కేటాయించి బిన్లలో వాటినే వేస్తున్నారని తెలిపారు. అలాగే మన రాష్ట్రంలో కూడా రోడ్లపై, బహిరంగ ప్రదేశాల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్తను వేయకుండా ఎవరికి వారు స్వీయ నియంత్రణ పాటించాలని కోరారు. ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్ లో మన రాష్ట్రం గతేడాది 6 స్థానం లో ఉందని, ఈ ఏడాది మన రాష్ట్రం ర్యాంక్ మరింత మెరుగుపరుచుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా ప్లాస్టిక్ ను డ్రైనుల్లో వేయరాదని, అలా చేయడం వల్ల ఎన్నో ఇబ్బందులు వస్తున్నాయన్నారు. అనంతరం మంత్రి నారాయణ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి, ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్, మునిసిపల్ ,పట్టణాభివృద్ధి డైరక్టర్ సంపత్ కుమార్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ పి. అనిల్ కుమార్ లు ఐఈసీ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో సంస్థలు, స్టేక్ హోల్డర్స్, ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్స్, పంచాయితీ, మున్సిపల్ శాఖాధికారులు పాల్గొన్నారు.

కూటమికే గుంటూరు పీఠం

నుంచి కోవెలమూడి రవీంద్ర, వైసీపీ నుంచి అచ్చాల వెంకటరెడ్డి పోటీలో ఉన్నారని ప్రకటించారు. కోవెలమూడి రవీంద్రను ప్రతిపాదు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ప్రతిపాదించగా 13 డివిజన్ కార్పొరేటర్ సంకూరి శ్రీనివాసరావు బలపరిచారు. అచ్చాల వెంకటరెడ్డిని ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం ప్రతిపాదించగా 45వ డివిజన్ కార్పొరేటర్ యక్కలూరి మారుతి బలపరిచారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి కోవెలమూడి రవీంద్రకు 34, వైసీపీ అభ్యర్థి అచ్చాల వెంకటరెడ్డికి 27 ఓట్లు వచ్చాయి. టీడీపీ అభ్యర్థి కోవెలమూడి రవీంద్ర మేయర్‌గా విజయం సాధించినట్లు ప్రిసైడింగ్ అధికారి ప్రకటించి, ధృవీకరణ పత్రం అందించి, మేయర్‌గా ప్రమాణస్వీకారం చేయించారు. ప్రమాణస్వీకారం అనంతరం రవీంద్ర మేయర్ చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. మేయర్‌గా విజయం సాధించిన కోవెలమూడి రవీంద్రకు ప్రిసైడింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ తేజ, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యేలు డాక్టర్ బూర్ల రామాంజనేయులు, నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, కార్పొరేటర్లు తదితరులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, కౌన్సిల్ సెక్రెటరి బి.శ్రీనివాసరావు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్ శ్రీనివాస్, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ పద్మనాభరావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీపీఎస్సీ మెయిన్స్ షెడ్యూల్ మార్చాలి

షెడ్యులు రూపొందిస్తారన్నారు. దీంతో ఏపీపీఎస్సీ మెయిన్సు ఈ ఏడాది సెప్టెంబరు. అక్టోబరుకు వాయిదా వేయడం వలన ఆశావాదులు మొదట యూపీఎస్సీ ప్రిలిమ్స్, మెయిన్సైపై దృష్టి పెట్టడానికి సాధ్యమవుతుందని సూచించారు. రాష్ట్రం నుంచి అత్యధికంగా విద్యార్థులు రెండు పరీక్షలపైనా సమర్థవంతంగా సిద్ధమయ్యేందుకు దోహదపడుతుందన్నారు. తద్వారా జాతీయ సేవలలో రాష్ట్ర ప్రాతినిధ్యం పెరుగుతుందని, ప్రతిష్ఠాత్మకమైన రెండు పరీక్షలలో బాగా రాణించడానికి అభ్యర్థులకు అవకాశం ఉంటుందని తెలిపారు. నగర సహాయ కార్యదర్శి సింగంశెట్టి మోహన్ ప్రసాద్, శీరం రవికుమార్, గంట మమత, నరేష్ పాల్గొన్నారు.

అందరికీ పింఛన్లు ఇవ్వాలి

కుదిరించడం వల్ల వాళ్ళు ఆర్థికంగా ఇబ్బందిపడుతున్నారని అన్నారు. కాంట్రాక్టర్ విజయ్ కుమార్ విచ్చేసి వర్కర్ల అనుమానాలు నివృత్తి చేశారు. పీఎఫ్‌కు సంబంధించి రావాల్సిన అన్ని వెంటనే చేస్తామని, అలాగే ఈఎస్ఐకు సంబంధించి అందరూ ఈఎస్ఐ కార్యాలయంలో కలిసి రిటైర్ కార్మికుల కుటుంబాలకు వర్తించే కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రిటైర్ అయిన తర్వాత కూడా ఈఎస్ఐ సేవలను పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కోటి వీరాంజనేయులు, శివయ్య, సూరిబాబు, దేవదానం, జాన్, నిర్మల, దేవమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని పర్యటన విజయవంతం చేయాలి

అధ్యక్షులు మునగపాటి వెంకట మారుతీరావు, పట్టణ ఉపాధ్యక్షులు గోవాడ దుర్గారావు, ప్రధాన కార్యదర్శులు షేక్ రియాజ్, తాళ్ళ అశోక్ యాదవ్, ధారా దాసు, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు, నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు ఆరుద్ర భూలక్ష్మి, క్లస్టర్ ఇన్‌చార్జులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కృష్ణా జిల్లా నుంచి లక్షమంది

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : మే 2వ తేదీన జరిగే అమరావతి నిర్మాణ పునఃప్రారంభ పనులకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ శంకుస్థాపన చేయనున్నారని, ప్రధానమంత్రి పర్యటన విజయవంతం చేయాలని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. పర్యటన ఏర్పాట్లపై కృష్ణాజిల్లా కలెక్టరేట్‌లో రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో సోమవారం సమీక్ష జరిగింది. మే 2న జరిగే కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుండి ప్రజలు పెద్ద ఎత్తున తరలి రానున్నారని, మన కృష్ణాజిల్లా నుండి లక్ష మంది వస్తారని అంచనా వేస్తున్నామన్నారు. సభకు విచ్చేసిన ప్రజలకు అన్నిరకాల సదుపాయాల్ని కల్పించేలా అధికారులను సన్నద్ధం చేస్తున్నామని, మన అమరావతి నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో హోం మంత్రి వంగలపూడి అనిత, జిల్లా ఇన్చార్జ్ మంత్రి వాసంశెట్టి సుభాష్, రాష్ట్ర మంత్రి బీసీ. జనార్ధన రెడ్డి, ఎమ్మెల్యేలు వర్ల కుమార్ రాజా, వెనిగండ్ల రాము, కాగిత కృష్ణప్రసాద్, బోడే ప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావు, మాజీ ఎమ్మెల్సీ బుద్దా నాగ జగదీశ్వరరావు పాల్గొన్నారు.

ముఠా కార్మికుల సంక్షేమానికి సమగ్ర చట్టం చేయాలి

- ముఠా కార్మిక సంఘం మహాసభలో తీర్మానం
- నూతన నాయకత్వం ఎన్నిక

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ముఠా కార్మికుల సంక్షేమానికి సమగ్ర చట్టం చేయాలని ఏఐటీయూసీ నగర కార్యదర్శి మూలి సాంబశివరావు అన్నారు. సోమవారం విజయవాడ లెనిన్‌భవన్‌లో విజయవాడ నగర 43వ మహాసభ జరిగింది. ఈ మహాసభలో పలు తీర్మానాలు చేశారు. అలాగే కార్మిక సంఘం నూతన నాయకత్వాన్ని ఎన్నిక చేశారు. అందులో 33 మంది కమిటీ సభ్యులుగా, 11 మంది ఆఫీస్ బేరర్స్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మూలి సాంబశివరావు మాట్లాడుతూ ముఠా కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెలబెట్టుకోవాలన్నారు. ముఠా కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం ఈఎస్ఐ, ఈపీఎఫ్ సౌకర్యం కల్పించాలని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల ముందు కూటమి నాయకులు తాము అధికారంలోకి వస్తే నగరాలలో రెండు సెంట్లు ఇంటి స్థలం వాటి నిర్మాణానికి రూ.4లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇల్లు లేని ముఠా కార్మికులకు వెంటనే ఇళ్లను కేటాయించాలన్నారు. ఆర్టీవో వారు వేస్తున్న కేసులను ఉపసంహరించుకోవాలని, ముఠా కార్మికులపై వేధింపులను ఆపాలన్నారు. పెరుగుతున్న నగర విస్తరణలో భాగంగా నగర శివారు ప్రాంతాలకు వెళుతున్న షాపుల యజమానులతో పాటు దశాబ్దాల కాలంగా పనిచేస్తున్న ముఠా కార్మికులను వారితో పాటు తీసుకుని వెళ్లి వారికి ఉపాధి కల్పించి, వారి కుటుంబాలను ఆదుకోవాలన్నారు.

నూతన నాయకత్వం ఎన్నిక ...

గౌరవ అధ్యక్షులుగా వియ్యపు నాగేశ్వరరావు, అధ్యక్షులు నాగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులు కోరే కొండలరావు, చిన్న అవులయ్య, కే.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి చొప్పా శ్రీరామచంద్రమూర్తి, డిప్యూటీ కార్యదర్శి బత్తుల తిరుపతయ్య, కార్యదర్శులు బోను శ్రీరాములు, సూరసాని రామిరెడ్డి, కోశాధికారి బైపిళ్ళ సత్యనారాయణ ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ముఠా కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలలో వేసవి శిక్షణా తరగతులు ప్రారంభం

విశాలాంధ్ర-పమిడిముక్కల: మండలంలోని శాఖా గ్రంథాలయా లలో వేసవి శిక్షణా తరగతులు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పమిడిముక్కల కపిలేశ్వరపురం, మేదూరులలో గ్రామ పెద్దలు, విద్యార్థులులతో ర్యాలీ నిర్వహించి గ్రంథాలయ ప్రాధాన్యత తెలిపారు. పమిడిముక్కల లో సర్పంచ్ ముళ్ళపూడి సునీత ప్రారంభించగా కపిలేశ్వరపురం లో కె.సత్యనారాయణ శిక్షణా తరగతులు ప్రారంభించగా శిక్షణా తరగతులు 28వ తేది నుంచి జూన్ 6 వరకు పలు అంశాలపై తరగతులు నిర్వహిస్తారని గ్రంథాలపాలకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో షరీఫ్(పమిడిముక్కల), వెనిగళ్ళ ప్రతాప్ (కపిలేశ్వరపురం),కె.సుబ్రమణ్యం (మేదూరు), గ్రామ పెద్దలు లంకా సుబ్రహ్మణ్యం, మహేందర్ జె.నాగేశ్వర రావు కొల్లిపర బాబి తదితరులు పాల్గొన్నారు.

పాకిస్థాన్‌ను తరిమి కొట్టండి

విశాలాంధ్ర-గన్నవరం : మానవత్వాన్ని మంట కలిపే ఉగ్రవాదాన్ని మట్టుపెట్టాలని అయోధ్య రెసిడెన్సి కన్వీనర్ ఏ వి వి ఎస్ఎస్ రాజు అన్నారు. గన్నవరం అయోధ్య గేటెడ్ కమ్యూనిటీ రెసిడెన్సి ఆధ్వర్యంలో ప్రతి నెల రెసిడెన్సి సమావేశం జరుగుతుందని తెలిపారు. జమ్మూ కాశ్మీర్ పెహల్గం లో పర్యాటకు లను అత్యంత ఘోరంగా కాల్చి చంపిన చర్యలను ఖండిస్తూ నిరసనగా కొవ్వొత్తుల ప్రదర్శన జరిగింది చేస్తున్నామని రెసిడెన్సి వాసులు తెలిపారు.ఈ సంద ర్భంగా ఏవీఎస్ రాజు మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్ దేశాన్ని ప్రపంచ పటంలో లేకుండా ఉగ్రవాదాన్ని అరికట్టాలని కోరారు. పర్యాటకులను అత్యంత క్రూరంగా కాల్చి చంపిన చర్యలను ఖండిస్తూ మరణిం చిన వారికి నివాళులర్పించారు. ముక్కామల ఉమామహేశ్వర మాట్లాడుతూ పాకిస్తాన్ ఉగ్రవాదులు అమెరికాపై దాడి చేసినప్పుడు అమెరికా బిల్లాడెన్ మట్టుపెట్టినట్లుగా పాకిస్తాన్ దేశంలో ఉగ్రవాదులను పట్టుకొని హతమార్చాలని డిమాండ్ చేశారు. ఇటువంటి చర్యలకు పాల్పడిన ముష్కర మూకలను ఏరివేసి జమ్మూ కాశ్మీర్‌లో శాంతి చేకూర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. దేశవ్యాప్తంగా ఉగ్రవాదాన్ని తుద ముట్టించే చర్యలు తీసుకోవాలని, అలాగే దేశంలో శాంతిని చేకూర్చే చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గుర్రం నాని, ఏ వి వి ఎస్ఎస్ రాజు ముక్కామల ఉమామ హేశ్వరరావు, దేగల చిన్న పుల్లయ్య, ఏ ఎస్ రాజు ఏ భారతలక్ష్మి, గోపీనాథ్ కేశర్ దుర్గారావు గోపి రావు, పి పార్వతి, ముక్కామల రజని కుమారి, వేణు గోపాల్ అయోధ్య గేటెడ్ కమ్యూనిటీ రెసిడెన్సి సభ్యులు పాల్గొన్నారు.

In the Court of the Honble VII Addl District Judge at Vijayawada
I.A. No. 556/2023 in O.S.No. 165/2016

Between:
Pamidimukkala Srinivasa Rao
...Petitioner / Plaintiff
And
Shaik Peer Saheb
...Respondent / Defendent
S/o. Mabusaheb, Muslim, aged 70 years D.No. 74-24-24/1, Ashoknagar, Vijayawada.

పై నెంబర్ Suit లో మీరు Respondent / Defendent No.1 అయిన మీకు శ్రీ కోర్టు వారు ఎన్ని పర్యాయములు శ్రీ కోర్టు సమన్లు (Notice) పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ ప్రకటన ద్వారా మీ హాజరు నిమిత్తము ది. 06-05-2025 తేదీన వాయిదా వేసియున్నారు. కావున ఈ రోజు ఉదయం 10.30 నిమిషములకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గానీ, న్యాయవాది ద్వారా గాని హాజరై అభ్యంతరములు ఉన్నచో తెలుపుకొనవలెను. లేనిచో ఈ దావా మీకు పరోక్షముగా తీర్మానించబడును.

శ్రీ కోర్టు వారి అనుమతితో
వాయిదా తేది: 06-05-2025

ఇట్లు
మత్తి శ్యామ్, అడ్వకేట్
డో.నెం. 30-9-7, ఎ.బి.హోమ్స్, ఎఫ్.ఎఫ్.2, నంబూరి వారి స్ట్రీట్, దుర్గా అగ్రహారము, విజయవాడ-2. సెల్: 9297051666

అవరోధాలను అధిగమించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలి

విశాలాంధ్ర-విజయవాడ: ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులు అవరోధాలను అధిగమించి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకునేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సూచించారు. సోమవారం పాఠశాల విద్యాశాఖ-సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బోండా మహేశ్వరరావు, అధికారులు, కలెక్టర్ పాల్గొని ఉపకరణాలు పంపిణీ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాల విద్యాశాఖ-సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు కలిగిన 173 మంది లబ్ధిదారులకు రూ. 18.70 లక్షల విలువైన 273 పరికరాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. బ్యాటరీ ఆపరేటెడ్ మోటరైజ్డ్ ట్రైసైకిళ్లు, బ్రెయిలీ కిట్లు, క్రచ్ ఎల్బోలు, టీఎల్ఎం కిట్లు, వీల్ ఛెయిర్లు, వాకింగ్ స్టిక్‌లు, రోలటార్లు వంటివి అందజేయడం జరిగిందన్నారు. ఈ ఉపకరణాలు ప్రత్యేక అవసరాల విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవచూపుతోందన్నారు. ఎమ్మెల్యే బోండా ఉమా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తూ అండగా ఉంటోందని, ప్రభుత్వ సదుపాయాలు, సేవలను సద్వినియోగం చేసుకోవాలని భవిష్యత్తులోనూ విభిన్న ప్రతిభావంతులకు ఇదేవిధమైన సహాయం అందుతుందని, సదరం సర్టిఫికెట్లతో కొత్త పెన్షన్లు కూడా అందించడం జరుగుతుందన్నారు. దివ్యాంగులకు రూ. 6 వేల పెన్షన్ అందుతుందన్నారు. విభిన్న ప్రతిభావంతుల సమగ్రాభివృద్ధిలో ఎన్‌జీవోలు కూడా భాగస్వాములవుతున్నాయన్నారు. కార్యక్రమంలో డీఈవో యూవీ సుబ్బారావు, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.మహేశ్వరరావు, సమగ్ర శిక్ష అధికారి ఎల్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు ఇవ్వండి మహాప్రభో?

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలం కాజలో 1, 9, 10 వార్డులలో నిసుమారు 100 కుటుంబాలకు తాగునీరు రావటం లేదని దీంతో ఇబ్బందులు పడుతున్నామంటూ కాజ పంచాయతీ (సచివాలయం) వద్ద మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. అయినంపూడి డ్రైన్ సమీపంలోని మంచినీటిని నూతి దగ్గర నుంచి తాగునీరు తెచ్చుకొనే పరిస్థితి ఏర్పడిందని, సమీపంలోని కుళాయి పంపు దగ్గర స్థానికులు గొడవపడి రావద్దని అడ్డు చెబుతున్నారని పేర్కొన్నారు. ఈ దశలో ఐలూరునుంచివచ్చే తాగునీరు మా వార్డులకు పైప్ లైన్ ఏర్పాటుచేసి అందరికీ అందేలా కృషి చేయాలని, ఆ పనులు పూర్తయ్యేలాగా వేసవిని దృష్టిలో పెట్టుకొని ట్యాంకర్ల ద్వారానైనా మంచినీరు సరఫరా చేయాలని కోరుతూ కాజ 1,9,10 వార్డు నివాసితులు సోమవారం సచివాలయం వద్ద ఖాళీ మంచినీటి బిందె లతో ధర్నా చేసి, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ జి.సుమదీష్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ అసిస్టెంట్ బాధితులతో మాటాడుతూ పైప్‌లైన్‌కు నిధులు మంజురయ్యాయని, త్వరలో పనులు ప్రారంభించి పైపులైన్‌తో తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలోకాగిత నాగ దుర్గ భవాని, మంద పాక ప్రమీల, జీవి నాంచారమ్మ, వెంకటేశ్వరమ్మ, సుబ్బారావు ,మాధవి ,రజిని, కామాక్షి, పద్మ, పార్వతి, ఆదిలక్ష్మి, వరలక్ష్మి, తదితరులు ఉన్నారు.

పీఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

విశాలాంధ్ర-గన్నవరం : అమరావతి రాజధాని ప్రాంతంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన సందర్భంగా ఏర్పాట్లు, భద్రతా అంశాలపై గన్నవరం విమానశ్రయంలో ప్రభుత్వ విభాగాల అధికారులు, విమానశ్రయ అధికారులతో సమీక్ష చేస్తున్న ప్రిన్సిపల్ సెక్రెటరీ టు గవర్నమెంట్ (పొలిటికల్) జనరల్ అడ్మినిస్ట్రేషన్ ముఖేష్ కుమార్ మీనా కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ డీ.కే బాలాజీ, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, అడిషనల్ డీజీ మధుసూదన్‌రెడ్డి, ఐజి అశోక్‌కుమార్, జిల్లా గంగాధరరావు, విమానశ్రయ డైరక్టర్ లక్ష్మీకాంత్‌రెడ్డి అధికారులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన తరగతులు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-అవనిగడ్డ: ప్రధమ శ్రేణి గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన తరగతులను గ్రామ సర్పంచ్ గురుముచ్చు ఉమా ప్రారంచారు. ప్రతి సంవత్సరం వేసవిలో 5 నుండి 10వ తరగతి చదివే చిన్నారులకు వేసవి విజ్ఞాన శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు ఈ కార్యక్రమంలో పాఠకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వేసవిలో పాఠశాలలు : ఏఐవైఎఫ్

విశాలాంధ్ర-గన్నవరం : సెలవు దినాల్లో కూడా విద్యార్థులకు సెలవులు ఇవ్వకుండా తరగతులు నిర్వహిస్తున్న కొన్ని కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థలకు ఏఐఎస్ఎఫ్ నాయకత్వం వెళ్లి సెలవులు ఇప్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ గన్నవరం నియోజవర్గం అధ్యక్ష కార్యదర్శులు వి.జి. ధీరజ్ (సిద్దు), క్రాంతి నాయకులు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల ధర్నా

విశాలాంధ్ర-ఉయ్యూరు : తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ కార్మికులు సోమవారం భోజన విరామ సమయంలో స్థానిక డిపో వద్ద నిరసన ధర్నాలు చేపట్టారు. నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు డిపో కమిటీ అధ్యక్షులు కృష్ణ ఆధ్వర్యంలో ఈ ధర్నా నిర్వహించారు. 1/ 2019 ఉత్తర్వులను వెంటనే అమలు చేయాలని, కార్మికులపై వేధింపులు తగ్గించాలని, అక్రమ సస్పెన్షన్లు ఆపాలని,ఆరోగ్య సెలవులపై పూర్తి జీతాలు అందించాలని వారి డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో పలువురు కార్మికులు నాయకులు పాల్గొన్నారు.

కిషోరి వికాసం పై శిక్షణ

విశాలాంధ్ర-పెదపారుపూడి : మండల వెలుగు కార్యాలయంలో కిషోరి వికాసం పై ఒకరోజు శిక్షణ ఐసిడిఎస్ సూపర్వైజర్లు జి. అరుణ కుమారి, ఎం. శివ నాగమణి అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా సూపర్వైజర్లు మాట్లాడుతూ మే నెల 2వ తేదీ నుండి జూన్ నెల 10వ తేదీ వరకు అన్ని గ్రామాలలో, అన్ని అంగనవాడి కేంద్రాల పరిధిలో 15 సంవత్సరాలు నుండి 18 సంవత్సరాలు వయసున్న కిషోరి బాలికలను గ్రూపులుగా ఏర్పాటు చేసి ప్రతి మంగళ, శుక్రవారాలలో విలేజి లెవెల్ కమిటీలో మహిళా పోలీస్ కన్వీనర్ గా ఉండి, అంగనవాడి కార్యకర్త, సచివాలయ ఏఎన్ఎం, ఆశ వర్కర్, వివో ఏ, ఈ ఐదుగురు కిషోరి బాలికలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యురాలు డాక్టర్ డి శ్రావిక, ఈ వో పి ఆర్ డి వంగ శ్రీనివాస్, ఏపీఎం మహంకాలరావు, మహిళా పోలీసులు, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, వివోఏలు, తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడిని ఖండించాలి

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : జమ్మూకాశ్మీర్ పహల్గాం ఉగ్రవాద దాడిని ప్రతిఒక్కరూ ముక్త కంఠంతో ఖండించాలని, అమాయకులైన పర్యాటకులపై దాడిచేసి ప్రాణాలు తీయడం అమానుషమని ఎపి ఎన్ జి ఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డి. సత్యనారాయణ రెడ్డి కార్యదర్శి పి. రమేష్ లు అన్నారు. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన భారతీయుల్లో రాష్ట్రానికి చెందిన నెల్లూరు జిల్లా కావలి వాసి కీ.శే.మధుసూదనరావుగారి కుటుంబ సభ్యులు,దాడిలో అసువులు బాసిన ఇతర భారతీయుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసేందుకు,ముష్కరుల దాడిని ఖండిస్తూ ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం విజయవాడ లెనిన్ సెంటర్ వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు డి.సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ దేశ ప్రజల హృదయాలను ఉగ్రదాడి తీవ్రంగా కలచివేసిందని.. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అయిన భారతీయ ప్రజల ఐక్యతను దెబ్బతీసేందుకు చేసిన ఇలాంటి దాడులను ప్రతిఒక్కరూ ఖండించాల్సిన అవసరముందన్నారు. ఉగ్ర దాడిలో అసువులు బాసిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు తెలిపారు. దుశ్చర్యకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. బాధిత కుటుంబ సభ్యులు అనుభవిస్తున్న మానసిక క్షోభ మాటల్లో చెప్పలేనిదని,ఈ కష్టకాలంలో వారికి ప్రతిఒక్కరూ తోడుగా నిలిచి మనోధైర్యాన్ని ఇవ్వాల్సిన అవసరముందని పేర్కొన్నారు.ఏపీ ఎన్‌జీవో జిల్లా కార్యదర్శి పి. రమేష్ మాట్లాడుతూ కాశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడి సంఘటన అమానవీయ చర్యని, ముష్కరులు దాడికి తెగబడిన తీరును రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఉగ్రవాదులను, వారిని ప్రోత్సహిస్తున్నవారిపై కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపి భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలకు పాల్పడకుండా కఠినంగా వ్యవహిరంచాలన్నారు. దేశ రక్షణ, భద్రత కోసం రేయింబవళ్లు సరిహద్దుల్లో పహారా కాస్తూ ముష్కరులకు సవాళ్లు విసిరిన వీర జవాన్ల తీరును అభినందించాల్సిన అవసరముందన్నారు. నగర శాఖ అధ్యక్షుడు సివిఆర్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణానికి నెలవైన కాశ్మీర్ లోయలో పర్యాటకులపై దాడికి తెగబడి అమాయకుల ప్రాణాలను బలిగొన్న ముష్కరుల రాక్షసత్వం ప్రతిఒక్క భారతీయున్ని కలచివేస్తోందని, ముష్కరులు దాడిలో అసువులు బాసిన వారికి ఘనంగా నివాళులు అర్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎన్‌జీవో జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

విశాలాంధ్ర-విజయవాడ : రాష్ట్రంలో ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలలకు పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఫెడరేషన్ ఆఫ్ అన్ ఎయిడెడ్ స్కూల్ అసోసియేషన్ రాష్ట శాఖ ప్రతినిధులు కే తులసి ప్రసాద్, పరుచూరి శ్రీనివాసరావు, శ్రీకాంత్, భరత్, సుందర్ రామ్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మొగ్రలాజపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు ఇబ్బంది పడకూడదని, విద్యార్థుల చదువులకు ఆటకం కలగకూడదనే ఉద్దేశంతో ఫీజులు చెల్లించకపోయినా వారిని కొనసాగిస్తున్నామన్నారు. మూడు సంవత్సరాలుగా ఇచ్చిన అడ్మిషన్లకు ఫర్ చైల్డ్ ఎక్స్పెండిచర్‌ను కమిటీ నిర్ధారించి పాత బకాయిలను చెల్లించి నూతన అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టాలన్నారు. రైట్టు ఎడ్యుకేషన్ కింద విద్యార్థులకు ఉచితంగా అడ్మిషన్లు ఇస్తున్నామని, ఉచితం సీట్లు కావని దాని తాలూకు ఫీజులను ప్రభుత్వం తమకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయాలన్నారు. మూడు సంవత్సరాల నుంచి బకాయిలను చెల్లించలేదన్నారు. 2025-26 ప్రవేశాలకు సంబంధించిన జిఓను విడుదల చేసారని, అది విడుదల చేసే ముందు స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్ ఒక స్థానంలో లేకుండా, రాబోయే సంవత్సరానికి ఉండాల్సిన ఫీజులు నిర్దారించకుండా ప్రవేశాల గురించి ప్రకటన చేశారన్నారు. యాక్ట్ 12 (1) సి అడ్మిషన్లకు తాము వ్యతిరేకం కాదని, గడిచిన సంవత్సరం 38 వేలు అడ్మిషన్లు చేశామన్నారు. ఈ యాక్ట్ అడ్మిషన్ల ప్రక్రియ పై తాము కోర్టును ఆశ్రయించగా తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని అమలు చేస్తున్నామన్నారు.

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

విశాలాంధ్ర-విజయవాడ: స్పష్టమైన సమాచారంతో పునరావృతం కాకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించేలా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుండి స్వీకరించిన అర్జీలకు సంబంధించి క్రింది స్థాయి అధికారులు సిబ్బంది నుండి స్పష్టమైన సమాచారం తీసుకుని అర్జీలు పునరావృతం కాకుండా సమస్యలను పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి పరచడమే లక్ష్యంగా అధికారులు పని చేసి ప్రభుత్వ లక్ష్యం నెరవేర్చాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) కార్యక్రమం పై ప్రజలు అనేక ఆశలు పెట్టుకున్నారన్నారు. సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కారం లభిస్తుందనే ఆశతో ప్రజలు ఎండ వేడిమిని సైతం లెక్కచేయక సుదీర ప్రాంతాల నుండి తరలి వచ్చి సమస్యలపై అర్జీలను సమర్పిస్తున్నారన్నారు. వారి ఆశలను నేరవేర్చి సమస్యలకు పరిష్కారం చూపడంలో జవాబుదారితనంతో అర్జీలను పరిష్కరించాలని అన్నారు.

122 అర్జీల స్వీకరణ :

రెవెన్యూ శాఖకు సంబంధించి 29, పోలీస్ శాఖకు 21, పురపాలక పట్టణాభివృద్ధి శాఖకు 8, పంచాయతీరాజ్ 7, సర్వే 6, డిఆర్‌డిఏ 6, వైద్య 6, జలవనరులు 5, విద్య 4, స్కిల్ డవలప్‌మెంట్ 4, కోఆపరేటివ్ 3, మైయిన్స్ 3, ఉపాధి కల్పన 2, విద్యుత్ 2, విభిన్న ప్రతిభావంతులు 2, వ్యవసాయం 2, ఆర్‌డబ్ల్యుఎస్, బిసి వెల్ఫేర్, పౌరసరఫరాలు, మార్కెటింగ్, రిజిస్ట్రేషన్, రైల్వే, లీగల్ సర్వీస్, సమగ్ర శిక్ష, అటవీ, రవాణ, ట్రైబల్ వెల్ఫేర్, బ్యాంకుకు సంబంధించిన ఒక్కొక్క అర్జీతో కలిపి మొత్తం 122 అర్జీలను స్వీకరించడం జరిగిందని ఇందులో 32 అర్జీలను స్వయంగాను 90 అర్జీలను ఆన్‌లైన్ ద్వారా స్వకరించిన్నట్లు కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. అర్జీల స్వీకరణలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వి నాంచారారావు గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో డాక్టర్లను నియమించాలి

విశాలాంధ్ర-మచిలీపట్నం : మచిలీపట్నం సర్వజన ఆసుపత్రి 70 స్టాఫ్ నర్సు పోస్టు, క్యాజువాలిటీలో ముగ్గురు పర్మనెంట్ డాక్టర్లు నియమించాలని కృష్ణ జిల్లా జేసీ గీతాంజలి శర్మకు బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షులు శేకుబోయిన సుబ్రహ్మణ్యం సోమవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సర్వజన ఆసుపత్రి లో 200మంది స్టాఫ్ నర్సు అవసరం అవ్వగా 130 వరకే ఉన్నారు. మిగతా 70 పోస్టులు నియమించుట వలన పేద- మధ్య తరగతి రోగులకు వైద్యం అందుతుంది. స్టాఫ్ నర్సులు తక్కువ ఉండుట వలన ఒక వార్డు డ్యూటీకి బదులుగా రెండు, మూడు వార్డులు డ్యూటీకు నియమిస్తున్నారు, కావున సకాలంలో రోగులకు వైద్యం అందడం లేదు పేద మధ్య తరగతి రోగులకు సరైన వైద్యం కొరకు ఇంకా 70 స్టాఫ్ నర్సులు పోస్టు నియమించాలి. అలాగే క్యాజువాలిటీలో ముగ్గురు డాక్టర్ పోస్టులు ఖాళీగా ఉండటం వలన తాత్కాలిక డాక్టర్లతో వైద్యం చేస్తున్నారు, క్యాజువాలిటీ లో ముగ్గురు డాక్టర్ పోస్టులను నియమించాలి. ఈ సమస్యలన్నిటినీ జాయింట్ కలెక్టర్ విన్నవించారు. భోగి రెడ్డి సుభాని, పెద్ది బోయిన సాంబయ్య, ఎం. పవన్ బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వృక్షాల నరికివేతపై ఎండీపీఓకు ఫిర్యాదు

విశాలాంధ్ర-కూచిపూడి : గ్రామాలలో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందింపజేసి పర్యావరణాన్ని కాపాడాలంటూ ముఖ్యమంత్రి నారాయణ చంద్రబాబు నాయుడు విస్తృతంగా ప్రచారం చేస్తుండగా దానికి భిన్నంగా నిడుమోలులో చెరువుకట్టపై వృక్షాలను నరికారు. ఆ గ్రామానికి చెందిన కొందరు పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ ఎం రాజేష్ తో కలిసి సోమవారం మొవ్వ ఎంపీడీవో జే విమాదేవికి లిఖిత పూర్వకంగా వినతి పత్రాన్ని అందజేసి తగుచర్యలు తీసుకోవాలని కోరారు. గుడివాడ డీ.ఎల్.పి.ఓ (ఉయ్యూరు ఇంచార్జ్) సంపత్ కుమారికి ఫిర్యాదు చేయాలని సూచించినట్లు ఆమె తెలిపారు. నిడుమోలులోని బందర్ రోడ్‌లోని పొలాల మధ్యలో ఉన్నసాలెవానిచెరువు కట్టకు నాలుగు వైపులా నున్న అధిక సంఖ్యలో వృక్షాలను గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ గొంతుపులి రాము, అతని కుమారుడు సురేష్, షరీఫ్‌లు కలసి నరికివేసినచెట్లని ఈనెల 23న అమ్ముకునే ట్రాక్టర్ల ద్వారా తరలించారని ఫిర్యాదు చేశారు. ఎంపీడీవోకి ఫిర్యాదు అందజేసిన వారిలో సర్పంచ్ కొమరగిరిఅంజలి, ఉప సర్పంచ్ డొక్కు మురళి, పాలకమండలి సభ్యులు, గ్రామస్తులు డి చింతయ్య మండల పరిషత్ ఉపాధ్యక్షులు డొక్కు వెంకటేశ్వర్లురావు, అధిక సంఖ్యలో గ్రామస్తులు ఉన్నారు.

మేడేను ఘనంగా నిర్వహించాలి

నగర కార్యవర్గ సభ్యులు బుద్దె రాజా పిలుపు

విశాలాంధ్ర-విజయవాడ (వన్ టౌన్): కార్మిక హక్కుల కోసం పోరాడి సాధించుకున్న చారిత్రాత్మక ఉద్యమాలకు గుర్తుగా మేడే దినోత్సవ వేడుకలను జరుపుకుంటామని ఈ వేడుకలను 40,41,42 డివిజన్లో ఘనంగా జరపాలని సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు, డివిజన్ పార్టీ ఇంచార్జ్ బుద్దె రాజా పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం స్వాతి సెంటర్‌లోని డివిజన్ సీపీఐ కార్యాలయం అమర్భవన్‌లో జరిగిన బ్రాంచి కమిటీ సభ్యుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. రాజా మాట్లాడుతూ కార్మిక హక్కుల సాధన కోసం నేటికీ పోరాటాలు తప్పడం లేదని అన్నారు. అసంఘటిత రంగంలోని కార్మికులు, సంఘటిత రంగం లోని ఉద్యోగులు కూడా వారి హక్కుల కోసం పోరాటాలు చేయాల్సి వస్తుందని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలలో మార్పులు తీసుకువచ్చి కార్మిక హక్కులు కాలరాస్తున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో డివిజన్ పార్టీ కార్యదర్శి టి.పుర్ణయ్య, సీనియర్ నాయకులు బాపనపల్లి ఆంజనేయులు, బాపనపల్లి రవి, కొమ్ము దేవయ్య, బిట్రా సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఎం.పీ.ఏ. థియరీ పరీక్షలు ప్రారంభం

విశాలాంధ్ర-కూచిపూడి : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం శ్రీ సిద్ధేంద్ర యోగి కూచిపూడి నాట్య కళా పీఠంలో ఎం.పి.ఏ. రెండవ సంవత్సరం విద్యార్థులకు నాలుగవ సెమిస్టర్ పరీక్షలలో భాగంగా రెండు రోజులు పాటు జరిగే థియరీ పరీక్షలకు 18 మంది విద్యార్థులు హాజరైనారు. నాట్య కళా పీఠం లో సోమవారం జరిగిన పరీక్షలో 'నాట్యంలో రసపరిశీల'అంశం పై రాత పరీక్షలు జరిగాయి. వీరికి పరీక్ష అధికారిగా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఏలేశ్వరపు శ్రీనివాసులు కొనసాగగా ముఖ్య పర్యవేక్షకులుగా అసిస్టెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ చింతా రవి వాల్లకు కృష్ణ వ్యవహరించారు. కాగా ఈనెల 30వ తేదీన రెండవ పరీక్ష నిర్వహిస్తామని వైస్ ప్రిన్సిపాల్ తెలిపారు.

వేసవి విజ్ఞాన తరగతులు ప్రారంభం

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ తృతీయ శ్రేణి శాఖ గ్రంథాలయంలో జూన్ 6వ తేదీ వరకు జరిగే వేసవి విజ్ఞాన తరగతులు సోమవారం నుంచి గ్రంథాలయ పాలకురాలు తూములూరి కృష్ణ కుమారి ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. వేసవి విజ్ఞానతరగతులకు తొలి రోజు 15 మంది బాలబాలికలు హాజరై నారు. వీరికి గ్రంథాలయ పాలకురాలు నీతి కథలు బోధించి చదివించి రాయించారు.

అసాంఘిక శక్తులపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : గంజాయి విక్రయిస్తున్న వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని హైకోర్టు న్యాయవాది పెటేటి రాజారావు ప్రభుత్వానికి, పోలీసులకు విజ్ఞప్తి చేశారు. నేరచరిత్ర కలిగిన కొంతమంది గంజాయి వ్యాపారం నిర్వహిస్తున్నారని వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సోమవారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ నెల్లూరు జిల్లా కొవ్వూరు మండలం పొడుగు పాడు గ్రామంలో సాయి ఎంక్లేవ్ అపార్ట్‌మెంట్‌ల్లో గంజాయి అమ్మకాలు జోరుగా సాగుతున్నాయన్నారు. అపార్ట్‌మెంట్‌లను అడ్డగా చేసుకొని నిడగుంట అరుణ తన అనుచరులైన కొంతమంది సహకారంతో కొవ్వూరు మండలాన్ని అడ్డగా చేసుకుని తన గంజాయి వ్యాపారాన్ని అసాంఘిక కార్యకలాపాలను ఎదేచ్చిగా కొనసాగిస్తుందని ఆరోపించారు.కొవ్వూరు మండలంలోని రేగుంటపాడు ఇనమడుగు చీరపాలెం పలు కాలనీలు బోడిగుండ్ల తోట చుట్టూ ఉన్న ప్రాంతాలలో ఇడగుంట అరుణ గంజాయి సామ్రాజ్యాన్ని విస్తరింప చేసిందన్నారు.మరికొన్ని ప్రాంతాలలో పాత నేరస్తులు అండతో గంజాయి వ్యాపారం,అసాంఘిక కార్యకలాపాలను నిర్వహిస్తు అక్రమంగా డబ్బు సంపాదించిన లక్ష్యంతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై పోలీసులు ప్రత్యేక నిగా పెట్టాలన్నారు. గంజాయిని విక్రయిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న ఇడుగుంట అరుణ, ఆమె అనుచరులపై నెల్లూరు పోలీసులు తగిన చర్యలు తీసుకొని ప్రజలను కాపాడాలని కోరారు.ఈ సమావేశంలో షేక్ మస్తానయ్య ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఏపికి డిఫెన్స్, ఏరోస్పేస్ పరిశ్రమలు : ఎంపీ కేశినేని

విశాలాంధ్ర-విజయవాడ : దేశంలోనే అత్యుత్తమ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ పాలసీని తీసుకువచ్చి డిఫెన్స్ అండ్ ఏరోస్పెస్ పరిశ్రమలు తీసుకువచ్చి రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి, ఉద్యోగ కల్పనే లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగుతున్నట్లు డిఫెన్స్ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు.రాష్ట్ర పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో డిఫెన్స్, ఏరోస్పేస్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్ పాలసీ, క్లస్టర్ల రూపకల్పన కోసం సోమవారం హోటల్ వివాంత సెమినార్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో డి.ఆర్.డి.వో మాజీ చైర్మన్ ఏపీ ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్ గౌరవ సలహాదారుడు డాక్టర్ జి.సతీశ్ రెడ్డి, ఏపీ స్పేస్ టెక్నాలజీ గౌరవ సలహాదారుగా ఇస్రో మాజీ చైర్మన్ ఎస్సీ సోమనాథ్, ఐ అండ్ సి అండ్ ఎఫ్.పి సెక్రటరీ ఎన్.యువరాజ్ ఐ.ఎ.ఎస్ అధికారి, ఇండస్ట్రీస్ డైరెక్టర్ ఎమ్.అభిషిక్త్ కిషోర్ ఐ.ఎ.ఎస్ అధికారి, జనరల్ ఆఫీసర్ కమాండింగ్ అజయ్ మిశ్రా పాల్గొని ప్రసంగించారు. అనంతరం ఎంపి కేశినేని చిన్ని ప్రసంగిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వం లో ఏపీ పారిశ్రామిక రంగంలో దేశం లోనే అగ్రగామి ఎదగాలని లక్ష్యం గా పెట్టుకుందన్నారు. అందులో భాగంగానే ఏపిలో ఏర్పాటు కాబోయే డిఫెన్స్ పరిశ్రమలు దేశంలోనే ముందు వుండే విధంగా డిఫెన్స్, ఏరోస్పేస్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్ పాలసీ, క్లస్టర్ రూపకల్పన అత్యుత్తమ పాలసీ తీసుకురాబోతున్నట్లు తెలిపారు. ఈ సెమినార్ కి దేశం మొత్తం 17 డిఫెన్స్ పి.ఎస్.యులు వుంటే 7 డిఫెన్స్ పి.ఎస్.యులు వారు హాజరు కాగా, మిగిలిన వారు మద్దతు ప్రకటించినట్లు తెలిపారు.

వేసవి శిక్షణ తరగతులు ప్రారంభం

విశాలాంధ్ర-గంపలగూడెం : కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ, పెనుగొలను శాఖ గ్రంథాలయం నందు సోమవారం నాడువేసవి శిక్షణా తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగినది. ఈ కార్యక్రమం లో భాగంగా ముందుగా మండల విద్యా శాఖాధికారి పి.వి.డి.యల్. నరసింహారావు రిబ్బన్ కట్ చేసి వేసవి శిక్షణా తరగతులను ప్రారంభించారు. తదుపరి జ్యోతిప్రజ్వలన చేసి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ.వి. నరసింహారావు, సాయిబాబా సేవా కమిటీ అధ్యక్షులు వి. నారాయణరావు, వాస్తు పండితులు నామా. రాములు, వివిధ పాఠశాలల కుచెందిన విద్యార్థులు పాల్గొన్నారు. గ్రంథాలయ నిర్వాహకురాలు జె. శ్రీలత అతిథులకు ధన్యవాదములు తెలిపారు.

నిర్మల ఫార్మసీలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

విశాలాంధ్ర-మంగళగిరి: ఆత్మకూరులోని నిర్మల ఫార్మసీ కళాశాలలో సోమవారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సామ్యుల రెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఫార్మసీ కళాశాలల నుంచి 25 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. నిర్మల ఫార్మసీ కళాశాల కరస్పాండెంట్ సెక్రటరీ సిస్టర్ జి.నిర్మల జ్యోతి ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మెడ్ ప్లస్ ఫార్మసీ ప్రతినిధి బి.జయకర్ రాజా, కళాశాల ప్లేస్మెంట్ ఆఫీసర్ ఎం.ప్రశాంతి, సిహెచ్.భార్గవ్ గోపి తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద దాడులు అరికట్టాలి

విశాలాంధ్ర-తాడికొండ : మతోన్మాద దాడులను అరికట్టాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్లు సోమవారం తాడికొండ, బండారుపల్లి గ్రామాలలో నిరసన ర్యాలీ చేపట్టారు. మతసామరస్యాన్ని కాపాడాలి అంటూ మతోన్మాద దాడులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మతోన్మాదులకు ప్రభుత్వం గట్టి బుద్ధి చెప్పాలని విజ్ఞప్తి చేశారు. విచక్షణ రహితంగా కాల్పులకు తెగబడిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో సిఐటీయూ నాయకులు ఎడ్లపల్లి గాంధీ రామ్మోహన్‌రావు, రైతు సంఘం నాయకులు చింతల భాస్కరరావు, పూర్వ అధిక సంఖ్యలో అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలింపు

విశాలాంధ్ర-పొన్నూ రు: మండలంలోని పెద్దపాలెం గ్రామ శివారులో సోమ వారం ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తవ్వి తరలిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ మట్టి తరలిస్తున్నారని పొన్నూరు తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్‌కు సమాచారం ఇవ్వగా విచారించి తగు చర్యలు తీసుకుంటానని వివరణ ఇచ్చారు. గతవారం క్రితం కూడా అక్రమంగా మట్టి తరలిస్తున్నారని సమాచారం ఇచ్చిన తహసిల్దార్ చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

కేసన అరెస్టు అప్రజాస్వామికం: క్రాంతికుమార్

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: జనగణనతో పాటే సమగ్ర కుల గణన జరపాలని ప్రధాన డిమాండ్‌తో ఈ నెల 27వ తేదీన విజయవాడలో శాంతియుతంగా జరుగుతున్న మహా ర్యాలీని పోలీసులు భగ్నం చేసి, ఆంధ్ర ప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు తదితరులను అక్రమంగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర యువజన అధ్యక్షులు కుమ్మర క్రాంతి కుమార్ తీవ్రంగా ఖండించారు. సోమవారం స్థానిక బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పది రోజులు ముందుగానే నగర పోలీస్ కమిషనర్‌కు మొత్తం కార్యక్రమం నిర్వహణ అను

మతి మంజూరుకై దరఖాస్తు చేసుకోగా, మహా ర్యాలీ జరుగుతుండగా వచ్చి, పోలీసులు అడ్డుకోవడం-రాష్ట్ర నాయకులను అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. సమగ్ర కులగణన నిర్వహణకు కేంద్ర-రాష్ట్ర ఎన్డీఏ కూటమి ప్రభుత్వాలు ముందుకు రాకపోగా, బీసీలు శాంతియుతంగా నిర్వహిస్తున్న మహా ర్యాలీని పోలీసులను అడ్డుపెట్టి, భగ్నం చేయాలనుకోవడం వెర్రితనం అవుతుందన్నారు. బీసీ ఉద్యమాలను పోలీసులతో అణచాలనుకుంటే, అంత కు పదింతలు బలంగా బీసీల ఐక్య ఉద్యమాలు నిర్మిస్తామన్నారు. బీసీల పార్టీగా చెప్పుకునే తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం, బీసీల డిమాండ్లపై జరిపే మహా ర్యాలీని ఆపాలనుకోవడం ఆత్మహత్యా సదృశ్యం అన్నారు. ఇందుకేనా బీసీలు 2024 ఎన్నికలలో కట్టగట్టుకుని కూటమికి మద్దతు ఇచ్చిందని వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తపరిచారు. పోలీసులను కూటమి ప్రభుత్వం అదుపులో పెట్టకోవాలని, లేకుంటే గత పాలకులకు పట్టిన గతే మీకు పడుతుందని హెచ్చరిస్తున్నామన్నారు. అలాగే బీసీ కుల జనగణన వెంటనే చేపట్టాలని త్వరలో మహా ర్యాలీ నిరసనలు చేపడతామని క్రాంతి కుమార్ తెలియజేశారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి కొల్లూరు హనుమంతరావు పాల్గొన్నారు.

శ్రీ సరస్వతి శిశుమందిర్‌లో పట్టా ప్రధానోత్సవం

విశాలాంధ్ర-తెనాలి : శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాల పట్టా ప్రధాన వేడుకలు తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో సోమవారం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా అంతరిక్ష శాస్త్రవేత్త, నాసా, ఇస్రో పూర్వ శాస్త్రవేత్త చందు సాంబశివరావు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యను బోధించడంలో సరస్వతి శిశుమందిర్ పాఠశాలలు ముందు వరుసలో ఉంటాయన్నారు. విద్యార్థుల్లో దేశభక్తిని పెంచే విధంగా బోధన సాగాలని చెప్పారు. విద్యతోపాటు క్రమశిక్షణ వినయ విధేయతలు విద్యార్థులు తప్పని సరిగా అలవర్చుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. శిశుమందిర్ గౌరవాధ్యక్షులు కొత్త సుబ్రహ్మణ్యం పట్టా ప్రదానం చేశారు. కార్యక్రమంలో కోడూరు ఉమాదేవి, డాక్టర్ సామల లక్ష్మణబాబు, సరస్వతీ విద్యాపీఠం విజయవాడ సమితి సభ్యులు సన్నిధి వెంకట సుబ్బారావు, యర్రంశెట్టి హనుమంతరావు, అవ్వారు లత తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి: ప్రభాకర్

విశాలాంధ్ర-మంగళగిరి : నగరాలు, పట్టణాలు, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచే పారిశుధ్య కార్మికులను ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి, సీపీఐ పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్ అన్నారు. సోమవారం మంగళగిరి పట్టణంలోని వేములపల్లి శ్రీకృష్ణ భవన్ ఏఐటీయూసీ కార్యాలయంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అన్నవరపు ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వాలు పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో విఫలం చెందాయని ఆయన అన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానం వల్ల కార్మిక వర్గం తీవ్రంగా నష్టపోతుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్మిక హక్కులను కాలరాసే విధానాలను చట్టాలను తీసుకు వచ్చారని ఆయన విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం బలవంతంగా అమలు జరిపే ప్రయత్నం చేస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు వివిధ రకాల శ్రమ దోపిడీకి గురవుతున్నారని ఆయన అన్నారు. కార్మికుల దినోత్సవం మే డే నాడు వాడవాడలా మే డే అరుణ పతాకాన్ని రెపరెపలాడించాలని ఆయన పిలుపునిచ్చారు. మే 20వ తేదీన దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మె జరగనున్న నేపథ్యంలో సమ్మెను జయప్రదం చేయాలని అన్నవరపు ప్రభాకర్ కోరారు. ఈ సమావేశంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గండికోట దుర్గారావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నందం బ్రహ్మేశ్వరరావు, బాపనపల్లి వెంకటేశ్వరరావు, రాచకొండ శివ, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

బాధితురాలికి లోకేష్ ఆర్థిక సాయం

విశాలాంధ్ర-మంగళ గిరి : పెదవడ్లపూడి గ్రామంలోని కొత్తపాలెంకు చెందిన షేక్ నన్నిబి ఇల్లు ఈ నెల 25న ప్రమాదవశాత్తు కాలిపోయింది. ఇంటిలో వంట చేసే సమయంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకొని ఇల్లు దగ్ధం అయింది. ఈ విషయం తెలుసుకున్న మంత్రి నారా లోకేష్ స్థానిక నాయకులను బాధితురాలి వద్దకు పంపించి రూ.15 వేలు ఆర్థిక సహాయం అందజేయించారు. అలాగే ప్రభుత్వం నుంచి నిత్యావసర వస్తువులను నన్నిబికి అందజేయించారు. ఈ సందర్భంగా మంగళగిరి మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ మాట్లాడుతూ బాధితురాలికి కూటమి ప్రభుత్వం తరపున న్యాయం చేస్తామని, కొత్త ఇల్లు మంజూరుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు యేళ్ళ శివరామయ్య, జనసేన పార్టీ అధ్యక్షులు నడపన దుర్గారావు, సీనియర్ నాయకులు మాదాల రమేష్ బాబు, చిట్టిబొమ్మ వెంకటేశ్వరరావు, యామినేని సుధాకర్, షేక్ అమీర్ బెగ్, షేక్ ఖాసీం, షేక్ షామిరుల్లా, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

వెంకయ్య చౌదరికి నివాళి

విశాలాంధ్ర-మంగ ళగిరి : విశ్వ హిందూ పరిషత్ మాజీ అధ్యక్షులు, శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరి స్వామి వాళ్ళ అన్నదాన ట్రస్ట్ కమిటీ ఉపాధ్యక్షులు వద్దమూడి వెంకయ్య చౌదరి సంస్మరణ కార్యక్రమం మంగళగిరి పట్టణంలోని సీకే హైస్కూల్ గ్రౌండ్‌లో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్, టీడీపీ రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి జవ్వాది కిరణ్ చంద్, టీడీపీ సీనియర్ నాయకులు మాదాల రమేష్ బాబు పూలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంకయ్య చౌదరి సేవా కార్యక్రమాలు చేయడంలో ఎప్పుడూ ముందుండేవారని అన్నారు.

వేసవి వడదెబ్బ తస్మాత్ జాగ్రత్త: అనూష

విశాలాంధ్ర-మంగళగిరి: వేసవి ఉష్ణోగ్రత తీవ్రతల వలన వడ దెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు పాటించాలని, మంగళగిరి గణపతి నగర్‌లోని ఇందిరానగర్ యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పీ అనూష అన్నారు. వడదెబ్బకు గురికాకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వడదెబ్బకు గురైతే తీసుకోవలసిన చర్యలు గురించి ఆమె వివరించారు. వడదెబ్బకు గురైన వారికి విపరీతంగా చెమటలు పట్టడం, తీవ్రమైన అలసట, తలనొప్పి, వికారంతో కూడిన వాంతులు, స్పృహ కోల్పోవడం, కోమాలోకి వెళ్లడం, ఫిట్స్ రావడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. వారిని వెంటనే చల్లని ప్రదేశానికి తీసుకువెళ్లి అవసరమైన బట్టలు మాత్రమే ఉంచి, శరీర ఉష్ణోగ్రత తలు తగ్గటానికి చల్లటి నీటితో కానీ, ఐస్ గడ్డలను వస్త్రంలో పెట్టి శరీరాన్ని తుడవాలన్నారు. కొబ్బరిబోండం నీరు, ఉప్పు కలిపిన మజ్జిగ, పండ్ల రసాలు, ఓఆర్ఎస్, ఎలక్ట్రాల్ వంటి లవణాలతో కూడిన ద్రవపదార్థాలు ఇవ్వాలన్నారు. వడదెబ్బ తీవ్రత లక్షణాలను బట్టి సమీపంలోని హెల్త్ సెంటర్ కు తరలించి వైద్యం అందించాలన్నారు. పిల్లలు, వృద్ధులు, మహిళలు, మద్యం సేవించేవారు త్వరగా వడదెబ్బకు గురయ్యే ప్రమాదాలు ఉన్నాయన్నారు. బీపీ, షుగర్, గుండె జబ్బులు ఉన్న వారు ఎండలకు జాగ్రత్తగా ఉండాలన్నారు. బయటికి వెళ్లేటప్పుడు టోపీలు, కాటన్ దుస్తులు ధరించడంతో పాటు నలుపు రంగు దుస్తులకు దూరంగా ఉండాలన్నారు. టీ, కాఫీ, జంక్ ఫుడ్స్, ఆల్కహాల్, కూల్ డ్రింక్స్ లకు దూరంగా ఉండి కొబ్బరి బొండం నీరు, మజ్జిగ, పుచ్చకాయ, తాటి ముంజలు వంటివి తీసుకోవాలన్నారు. యూపీహెచ్‌సీలో ఓఆర్ఎస్ ప్యాకెట్స్ ఉచితంగా అందజేస్తున్నామన్నారు. వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే సమీపంలోని యూపీహెచ్‌సీలో ప్రభుత్వం అందించే ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ అనూష అన్నారు.

ఎఫ్‌సీఐ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర చైర్మన్‌గా బందా

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : పదవీ విరమణతోనే జీవితానికి ఫుల్‌స్టాప్ పడినట్లు కాదనీ... అక్కడి నుంచి సామాజిక స్పృహతో సరికొత్త అధ్యాయాన్ని ప్రారంభించడమే ఎవరి జీవితానికైనా అర్థం-పరమార్థాన్ని ఆపాదించిపెడుతుందని ఎమ్మెల్సీ, స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు లేళ్ళ అప్పిరెడ్డి పేర్కొన్నారు. అందుకు భారత ఆహార సంస్థ విశ్రాంత ఉద్యోగుల నడవడికే ప్రత్యక్ష నిదర్శనమని ఆయన కొనియాడారు. భారత ఆహార సంస్థ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర చైర్మన్‌గా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి, గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్ తిరిగి రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గుంటూరు అమరావతి రోడ్డులోని మల్లేశ్వరి ఫంక్షన్ హాలులో సోమవారం జరిగిన రాష్ట్ర సమావేశంలో ఈమేరకు ఎన్నికలు నిర్వహించారు. విశాఖపట్నంకు చెందిన ఆలిండియా వైస్ చైర్మన్ ఏఎస్ రామారావు, తాడేపల్లిగూడెంకు చెందిన కె.సుధాకరరావు ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. బందా రవీంద్రనాథ్‌తో పాటు రాష్ట్ర వైస్ చైర్మన్‌గా రాజమండ్రికి చెందిన కె.నాగేశ్వరరావు, కార్యదర్శిగా భీమవరంకు చెందిన జి.గోపాలరావు, సహాయ కార్యదర్శిగా విజయవాడకు చెందిన ఆర్.సాయిబాబు, కోశాధికారిగా పశ్చిమ గోదావరికి చెందిన డి. మురళీమోహన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గుంటూరు జిల్లా చైర్మన్‌గా పి.యలమంద, కోశాధికారిగా ఎస్.ప్రభాకరరావు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నేతలు నల్లయ్య, నాగమల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు తెలిపిన అప్పిరెడ్డి

కోటప్పకొండ దేవస్థానానికి విరాళం

విశాలాంధ్ర-నరసరావుపేట: యల్లమంద గ్రామ వాస్తవ్యులు మానుకొండ శివ రామ కృష్ణ కోటప్ప కొండ త్రికోటేశ్వర స్వామి దేవస్థానానికి రూ. లక్ష ఎనిమిది వేల విరాళం అందించారు. టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబును కలిసి చెక్కును సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను అభినందించారు. ఈ విరాళాన్ని దేవాలయం ఈవోకు అందిస్తామని తెలిపారు. గ్రామ నాయకులు తాండవ కృష్ణ, రామకృష్ణ పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞాన సముపార్జన

విశాలాంధ్ర-అమరావతి: వినోదాన్ని విజ్ఞానాన్ని వికాసాన్ని అందిస్తూ ఆరోగ్యమైన సమాజాన్ని అధ్యయనం చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వేసవి విజ్ఞాన శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని గ్రంథాలయ స్థలదాత తలం కాశీ విశ్వనాథ్. ప్రదీప్ అన్నారు. మండల కేంద్రమైన అమరావతిలోని శాఖ గ్రంథాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన రారండోయ్ సమ్మర్ క్యాంప్ సద్వినియోగ పరుచుకోండి అనే శిబిరాన్ని ప్రారంభిస్తూ మాట్లాడారు. ఈ సభకు శాఖ గ్రంథాలయ ఇన్చార్జి ఎం వెంకాయమ్మ అధ్యక్షత వహించారు. విద్యార్థిని విద్యార్థులతో యోగ డాన్స్ తో పాటు పుస్తక పఠనం పేపర్ క్రాఫ్ట్ స్మోకింగ్ ఇంగ్లీష్ పెయింటింగ్ పప్పెట్ మేకింగ్ సెస్ క్యారమ్స్ క్విజ్ తదితరాలు నిర్వహించారు. ఉపాధ్యాయ ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రంథాలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

రిలే నిరాహార దీక్షలు ప్రారంభం..

విశాలాంధ్ర - వినుకొండ : ఏపీ. పి.టి.డి, నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కొరకు ఈ నెల 28, 29వ తేదీలలో రిలే నిరాహార దీక్షలు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపోలలో జరుగుతు న్నాయి. ఈ నేపథ్యంలో వినుకొండ డిపోలో ఎన్. ఎం.యు.ఏ సెక్రటరీ వి.ఎస్పి. నాయక్ ఆధ్వర్యంలో సోమవారం రిలే నిరాహార దీక్ష ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో ఎన్.ఎం.యు.ఏ సభ్యులు పాల్గొని వారికి సంఘీభావం తెలిపారు. ఈ నిరాహార దీక్షలో పి కృష్ణ, ఎస్.కె ఎస్ బాబు, ఎస్.కె మౌలాలి, ఎస్కే సైదా, జి నాగేశ్వరరావు, కె.ఎస్.ఎన్. రెడ్డి, డి.ఎస్. రావు, కె.ఎస్.రావు పాల్గొన్నారు.

విద్యార్థికి ఘన సన్మానం

విశాలాంధ్ర-వినుకొండ: పది పరీక్ష ఫలితాలలో విద్యా వికాస్ హైస్కూల్ విద్యార్థి దత్తలూరి సైదావలి 600 మార్కులకు గాను 589 మార్కులు సాధించి స్కూల్ ఫస్ట్ గా నిలిచాడు. ఈ నేపథ్యంలో వినుకొండ నియోజకవర్గం నూర్ భాషా సంఘం ఆధ్వర్యంలో విద్యార్థి దత్తలూరి సైదావలిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా లాయర్ సిద్దయ్య మాట్లాడుతూ. నియోజకవర్గంలోని అలీ బాయి పాలెం గ్రామానికి చెందిన దత్తలూరి మీరావలి పది ఫలితాలలో 589 మార్కులు సాధించారని, అదేవిధంగా ఉన్నత చదువు లలో కూడా రాణించి జీవితంలో స్థిరపడాలని ఆకాంక్షిం చారు. ఈ కార్యక్రమంలో లాయర్ షేక్. సిద్దయ్య, ఏల్చూరు మస్తాన్, ఆర్మీ ఈశ్వరయ్య, పెద్దవరం పెద్ద కాసిం, దత్తలూరి మీరావలి, ఎస్.కె అంజి, తదితరులు పాల్గొన్నారు.

రైతు తలసరి ఆదాయంలో అగ్రస్థానమే

చంద్రబాబు ఆశయం: జీవీ

విశాలాంధ్ర - వినుకొండ : రైతుల తలసరి ఆదాయంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలో అగ్రస్థానంలో ఉంచడమే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయమని ప్రభుత్వ చీఫ్ విప్, జీవీ ఆంజనేయులు అన్నారు. ఆ లక్ష్యం చేరుకోవడానికే రాయితీపై యంత్ర పరికరాలు, సేంద్రియ సేద్యం వంటి విధానాలతో కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. పట్టణ మార్కెట్ యార్డులో సోమవారం రైతులకు రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రోన్ల సాయంతో ఎరువులు వేయడం రైతులకు లాభ సాటిగా ఉందని, అందుకే 80% రాయితీతో వాటిని అందిస్తున్నామన్నారు. డ్రోన్ ఖరీదు రూ.10 లక్షల ఉంటే రూ.8లక్షల వరకు సబ్సిడీ ఇస్తున్నట్లు వెల్లడించారు. అందులో కేంద్రం 50శాతం భరిస్తోందన్నారు. వినుకొండలో రూ.50 లక్షల విలువైన పరికరాలు పంపిణీ చేయడం సంతోషంగా ఉందంటూ సబ్సిడీ వ్యవసాయ పరికరాలు తీసుకుంటున్న రైతులకు అభినందనలు తెలిపారు. సీఎం చంద్రబాబు సంకల్పం మేరకు రాష్ట్రం మొత్తం రూ.417కోట్లతో వేలాదిమందికి సబ్సిడీలో వ్యవసాయ పరికరాలు అందిస్తున్నామని, 2014-19 మధ్య కూడా 3లక్షల 20 మందికి రూ.1227కోట్లు ఖర్చు పెట్టి పరికరాలు పంపిణీ చేశామన్నారు. జగన్ ప్రభుత్వంలో కేవలం రూ. 340 కోట్లే ఖర్చు చేసి ఆ లక్ష్యాన్ని కూడా నీరుగార్చారని వాపోయారు. తెలుగుదేశం గత ప్రభుత్వంలో సూక్ష్మపోషకాలూ ఉచితంగా, 90% రాయితీతో డ్రిప్ సామాగ్రి ఇచ్చామన్నారు. భూసార పరీక్షలు పెద్దఎత్తున నిర్వహించి పంట సూచనలు అందించామన్నారు. మధ్యలో జగన్ ఆపేసిన ఆ కార్యక్రమాలన్నీ ఇప్పుడు తిరిగి అందిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక 3లక్షలమందికి పైగా రైతులకు భూసార పరీక్షలు చేసి పంట సూచనలు అందించినట్లు తెలిపారు. సేంద్రియ సాగుకు పెద్దఎత్తున ప్రోత్సాహం ఇస్తున్నామని, రైతులు కూడా తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధించేలా ఈ రంగంలో ముందుకు వెళ్లాలని సూచించారు. మాజీ శాసన సభ్యులు మక్కెన మల్లికార్జున రావు, జనసేన నాయకులు నాగ శ్రీను రాయల్, లగడపాటి వెంకట్రావు, ముంద్ర సుబ్బారావు, మీసాల మురళీకృష్ణ, గోవింద నాయక్, బచ్చు అంజిరెడ్డి, పత్తి పూర్ణచంద్రరావు, వ్యవసాయ శాఖ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

డీఎస్సీ నిబంధనలు సడలించాలి

విశాలాంధ్ర-చిలకలూరిపేట: డీఎస్సీ నిర్వహణలో ఉన్న నిబంధనలు సడలించి నిరుద్యోగ యువతను ఆదుకోవాలని భారత రాజ్యాంగ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు సిహెచ్ సుబ్బారావు అన్నారు. సోమవారం పట్టణం లోని శ్రీ శారద జిల్లా పరిషత్ ఉన్నత హైస్కూల్ వద్ద ఉన్న స్టడీ సర్కిల్ హాల్లో ఏర్పాటు చేసిన ఉద్యోగస్తుల ప్రత్యేక సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఇంటర్, డిగ్రీ, పీజీలలో వచ్చిన మార్కుల పర్సంటేజ్‌తో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికి డీఎస్సీ పరీక్ష రాసేనందుకు అవకాశం ఇవ్వాలని. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ నార్మలైజేషన్ విధానంలో మెరిట్ ఉన్నవారికి అన్యాయం జరగకుండా చూడాలని, డీఎస్సీ పరీక్షలు రాయటానికి కనీసం 90 రోజులు సమయం ఇవ్వాలని ఈ పరీక్షలు అయ్యేంతవరకు ఏపీపీఎస్సీ పరీక్షలు కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్షలు వాయిదా వేయాలని కోరారు. జిల్లాకు ఒకే పేపరు ఉండేలా చర్యలు తీసుకోవాలని, గత ఏడు సంవత్సరాలు నుండి డీఎస్సీ నోటిఫికేషన్ లేనందున అభ్యర్థుల వయోపరిమితిని 47కు పెంచాలనీ, ఆన్లైన్లో దరఖాస్తు అప్లై చేసుకోవడానికి ఎదురవుతున్న వెబ్సైట్లు లోని సాంకేతిక పరమైన అవరోధాలను తొలగించాలని, ఎస్సీ ఎస్టీలకు గతంలో ఇచ్చిన పర్మనెంట్ క్యాస్ట్ సర్టిఫికెట్స్ అనుమతించాలని కోరారు. సమితి నాయకులు జి.అనిల్ కుమార్, ఎం.ప్రసన్నకుమార్, కె.విజయ్ కుమార్, ఎ.అంజయ్య, కె.ఓబయ్య పాల్గొన్నారు.

గడువులోగా ఫిర్యాదులు పరిష్కరించాలి

విశాలాంధ్ర-నరసరావుపేట: జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాస రావు పాల్గొని ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. కుటుంబ, ఆర్థిక, ఆస్తి తగాదాలు,మోసం మొద లగు ఆయా సమస్యలకు సంబంధించి 73 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదు లకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి త్వరిత గతిన పరిష్కరించే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని, ప్రతి ఫిర్యాదుదా రుని సమస్య పట్ల శ్రద్ధ వహించి, నిర్ణిత గడువులోగా పరిష్కరించడానికి కృషి చేయాలని ఎస్పీ సూచించారు. ప్రజలకు వారి ఫిర్యాదులను రాసి పెట్టడంలో పోలీస్ సిబ్బంది సహాయ సహకారాలు అందించారు. దూర ప్రాంతాల నుండి వచ్చిన వారికి భోజన సదుపాయం ఏర్పాటు చేశారు.

గీతాంజలి విద్యార్థులకు అభినందన

విశాలాంధ్ర-వినుకొండ: పదో పరీక్షల లో టౌన్ ఫస్ట్ సాధించిన గీతాంజలి విద్యార్థులను ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన అభినందన సభలో జీవి, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, డైరెక్టర్ వై.శేషగిరిరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీవి మాట్లాడుతూ. విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తు కోసం ఈర్ష ద్వేషాలను ప్రక్కన పెట్టి ఇతరులు సాధించిన మంచి విషయాలను, విజయాలను అభినందిం చాలి. సంతోషంగా ఉంటూ అందరికీ అనుకూలంగా ఉంటూ మంచి వక్తలుగా ఉండాలని అన్నారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

నేడు వీరబ్రహ్మేంద్రస్వామి తిరునాళ్ల

విశాలాంధ్ర - దాచేపల్లి : ముత్యాలంపాడులో శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం సందర్భంగా మంగళవారం ఊర్లో తిరునాళ్ళ జరుగనుంది. ఈ సందర్భంగా దాతల సహకారంతో మహా అన్నదానం చేయనున్నారు. అదేవిధంగా స్థానిక పాఠశాల విద్యార్థుల చేత కోలాటం ప్రదర్శన తదితర కార్యక్రమాలు ఉన్నట్లు నిర్వాహకులు చెప్పారు.

వార్షిక తిరునాళ్ల మహోత్సవం

విశాలాంధ్ర-యడ్లపాడు: మండలంలోని చారిత్రాత్మక కొండవీడు కొండలలోని కొత్తపాలెం గ్రామ పరిధిలో కొలువై వున్న శ్రీ బొల్లు మోర వెంకటేశ్వరస్వామి దేవాలయ వార్షిక తిరునాళ్లు సోమవారం ఘనంగా నిర్వహించారు. సమీప గ్రామాలనుండి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. అర్చకస్వాములు స్వామివారిని విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి దర్శనార్థం వచ్చిన భక్తులతో, ఆలయ ప్రాంగణంలో "గోవింద... . గోవింద.." అంటూ భక్తులు చేసిన నినాదాలు కొండల గుండెల్లో మార్మోగాయి. భాజా భజంత్రీలతో అశేష భక్తజనం నడుమ పండితుల వేదమంత్రాలతో కన్నుల పండువగా నిర్వహించిన శాంతి కల్యాణంలో వివాహిత దంపతులు పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందారు. భక్తులకు ప్రత్యేకంగా అన్నసంతర్పణ ఏర్పాటు చేసారు. విద్యుత్ దీపాల అలంకరణ చేశారు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

నేడు అవగాహన సదస్సు

విశాలాంధ్ర - దాచేపల్లి : గ్రామీణ మండలంలోని రామాపురంలో నివసిస్తున్న మత్స్యకారులకు మంగళవారం వివిధ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ కుటుంబరావు తెలిపారు. తుఫానులు, వరదలు వచ్చినప్పుడు తీసుకోవల్సిన జాగ్రత్తలను తెలిపారు.

కిశోరి వికాసం కమిటీలపై అవగాహన

విశాలాంధ్ర - దాచేపల్లి : అంగన్వాడీ కేంద్రాల పరిధిలో కిశోరి వికాసం కమిటీలపై కార్యకర్తలకు సోమవారం అధికారులు అవగాహన కల్పించారు. దాచేపల్లి, కేసానపల్లి సెక్టార్లలోని రెండు కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సదసుల్లో సామాజిక కార్యకర్త జయరాజ్, పర్యవేక్షకులు శ్రీలక్ష్మి, అరుణశ్రీ మాట్లాడుతూ 11 నుంచి 14, 15 నుంచి 18 సంవత్సరాల వయసు కలిగిన కిశోర బాలికలను గుర్తించి వారందరినీ తగనన్ని సంఘాలుగా ఏర్పాటు చేయాలని సూచించారు. చదువు పట్ల ఆసక్తిని పెంపొందించడం, బాల్య వివాహాలను అరికట్టడం, సమస్యల పరిష్కారానికి చొరవ చూపడం తదితర అంశాలపై వారందరిలో విజ్ఞానాన్ని పెంచాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఏఎన్ఎం లావణ్య, అంగన్వాడీ కేంద్రాల కార్యకర్తలు, డ్వాక్రా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రీవీర్ల అంకమ్మతల్లి గ్రామోత్సవం

విశాలాంధ్ర - దాచేపల్లి : శ్రీ వీర్ల అంకమ్మ తల్లి కొలుపుల తిరునాళ్లలో భాగంగా సోమవారం నిర్వహించిన గ్రామోత్సవంలో అమ్మవారిని భక్తులు, మహిళలు కనుల పండువగా పల్లకి సేవ చేశారు. ఊర్లో ఉన్న దుష్ట శక్తులను పారదోలడానికి పూల కప్పెర, పాప వేషం కార్యక్రమాలు చేశారు. చదలవాడ వెంకట తులసీ సుధాకర్, రేణుక, రాజశేఖర్, సాయికిరణ్మయి దంపతులు అమ్మవారికి పుట్టింటి పసుపు కుంకుమ, పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ దంపతులు రూ 15 లక్షల ఖరీదు కలిగిన 75 సెంట్ల స్థలాన్ని ఆలయానికి ఇచ్చారు. దాచేపల్లి, నారాయణ పురం ఆర్య వైశ్య మహిళలు అమ్మవారికి సారె సమర్పించారు. వేలాది మందికి అన్నదానం చేశారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మతోన్మాద తీవ్రవాదం నశించాలి

విశాలాంధ్ర - పిడుగురాళ్ల : పహల్గామ్‌లో పర్యాటకులపై పాశవిక దాడిని నిరసిస్తూ.. మతోన్మాద ఉగ్రవాదుల దాడులు నశించాలని యోగ సాధకులు శాంతి ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం ఉదయం జరిగిన ర్యాలీలో యోగ సాధకులు పాల్గొన్నారు. స్థానిక వాసవి కళ్యాణ మండపం నుండి ఆరంభమైన శాంతి ర్యాలీ ఐలాండ్ సెంటర్ మీదుగా సాగింది. ఉగ్రవాదుల దాడిలో అశువులు బాసిన భారతీయుల ఆత్మ శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ దాడికి పాల్పడిన ఉగ్రవాదులను అంతమొందించాలని నినాదాలు చేశారు. ర్యాలీలో సేవా కేంద్రం గురువులు అర్వపల్లి పూర్ణరమేష్, రమణారావు, పి సీతారామయ్య, యడవల్లి ఆంజనేయులు, కోటేశ్వరమ్మ, ఎన్ శ్రీనివాసరావు, సాంబయ్య, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని పర్యటన ఏర్పాట్ల పరిశీలన

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మే 2వ తేదీన అమరావతి రాజధాని నిర్మాణ పనులను పునః ప్రారంభించేందుకు అమరావతి రానున్న నేపథ్యంలో అక్కడి ఏర్పాట్లను సోమవారం సాయంత్రం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ శాఖ కమిషనర్ వీర పాండ్యన్, గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ, గుంటూరు రేంజ్ ఐజి సర్వశ్రేష్ఠ త్రిపాఠి, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ పరిశీలించారు. సభా ప్రాంగణం వద్ద చేపట్టవలసిన ఏర్పాట్లు, వీవీఐపీలు, ప్రజలు ప్రయాణించే మార్గాలు, వాహనాల పార్కింగ్‌కు సంబంధించి ప్రాంతాలను పరిశీలించి చేపట్టవలసిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించి సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కె.శ్రీనివాసరావు, ఆర్ అండ్ బీ ఎస్ఈ శ్రీనివాస మూర్తి, రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్ట్‌కు ఘనసన్మానం

విశాలాంధ్ర- మాచర్ల : పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ ఓరుగంటి చెన్నకేశవ రావును నరసరావుపేటలో ఆదివారం ఘనంగా సన్మానించారు. వాసవి అన్నదాన నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో కమిటీ నిర్వాహకులు బత్తుల మురళి తల్లిదండ్రులైన భత్తుల వెంకటరత్నం, అచ్చమాంబ ల జ్ఞాపకార్థంతో పాటు తన తండ్రి తెలుగు వెలుగు వారపత్రికను 25 సంవత్సరాల పాటు నడిపించినందుకు గుర్తుగా జర్నలిస్టులను గౌరవించి పల్నాడు జిల్లా పరిధిలోని 50 మంది జర్నలిస్టులకు ఎమ్మెల్యే చదలవాడ అరవింద్ బాబు చేతుల మీదుగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాచర్ల నుండి సీనియర్ జర్నలిస్ట్ ఓరుగంటి చెన్నకేశవరావును సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనను పట్టణంలోని పలువురు పాత్రికేయ మిత్రులు,పట్టణ ప్రముఖులు, పలు స్వచ్ఛంద సంస్థ సభ్యులు అభినందించారు.

విజయవంతంగా పల్నాడు మేజిక్ ఫెస్టివల్-2025

విశాలాంధ్ర-నరసరావుపేట: పల్నాడు జిల్లా మ్యాజిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిం చిన పల్నాడు జాతీయస్థాయి మేజిక్ ఫెస్టివల్-2025 కార్యక్రమం విజయవంతం అయిందని నిర్వాహకులు తెలిపారు. స్థానిక భువన చంద్ర టౌన్ హాల్ నందు నిర్వహించిన ఈ కార్యక్రమంలో జాతీయస్థాయిలో ఇతర రాష్ట్రాల నుండి 350 మంది ఇంద్రజాలికులు హాజరయ్యారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు పాల్గొన్నారు.కార్యక్రమంలో ఎస్.మనోహర్ రాజమండ్రి, కళ్యాణ్ వరంగల్, నరేన్ కరీంనగర్ మెజీషియన్స్ కి లెక్చరర్ గా డెమో క్లాసులు అందించారు. జాతీయస్థాయిలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఇంద్రజాల ప్రదర్శనక మెలకువలు ట్రైనింగ్ క్లాసులు ఉదయం 10 నుండి సాయంత్రం 5 వరకు నిర్వహించారు.ఉత్తమ ప్రదర్శన అందించిన సీనియర్ విభాగం మెజీషియన్స్ ప్రథమ బహుమతి నితిన్ (హైదరాబాద్), ద్వితీయ బహుమతి అన్వర్ భాష (విశాఖపట్నం), తృతీయ బహుమతి లక్ష్మీ ప్రసన్న (తణుకు), జూనియర్స్ విభాగం ధనుష్ శ్రీ (గుంటూరు), ఎడ్లపల్లి శ్రీవల్లి (గుంటూరు), మహబూబ్ సుభాని (నరసరావుపేట) వీరికి ఎమ్మెల్యే చేతుల మీదుగా బహుమతులు అందించి సన్మానించారు.

మేడే జయప్రదం చేద్దాం: ఆరేటి

విశాలాంధ్ర-పొన్నూరు: ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ పొన్నూరు నియోజకవర్గ అధ్యక్షులు ఆరేటి రామారావు అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘాల ముఖ్య కార్యకర్తల సమా వేశానికి ఆటో యూనియన్ అధ్యక్షులు మేలుగ సత్యనారాయణ అధ్యక్షత వహించగా ఆరేటి మాట్లాడుతూ కార్మి కులను బానిసలుగా చూసే రోజుల్లో కార్మిక హక్కుల కోసం 8 గంటల పని దినం కోసం సంఘాలు పెట్టుకొని కార్మికులను చైతన్యపరిచి పోరాట మార్గం వైపు తీసుకువెళ్లిన కార్మిక నాయకులను నిర్దాక్షిణ్యంగా అమెరికన్ ప్రభుత్వం ఉరితీసిందని అనేక మంది కార్మికులు తుపాకీ గుళ్ళకు బలి అయ్యారని అన్నారు. అమెరికాలో చికాగో పట్నంలో జరిగిన పోరాటంలో నేలకొరిగిన వీరులను స్మరించు కుంటూ ఈ మేడే జరుపుకోవాలని అన్నారు. పొన్నూరు పట్టణంలో ఏఐటీయూసీ కార్మిక సంఘాలు మే పతాకవిష్కరణలు, ర్యాలీలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సెంట్రింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు గుంటూరు ఏడుకొండలు, పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు గుమ్మడి రోశయ్య, బోరు అండ్ ప్లంబింగ్ ఎలక్ట్రిసిటీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కంచర్ల సుధీర్, కార్పెంటర్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు బత్తిన శ్రీనివాసరావు, రాడ్ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు మిక్కిలి జాన్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ సరఫరా సకాలంలో జరగాలి: జీవీ

విశాలాంధ్ర - వినుకొండ : రేషన్ సరఫరాలో అక్రమాలు జరిగిన, నిర్లక్ష్యంగా వ్యవహరించిన చర్యలు తప్పవని ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు హెచ్చరించారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో సోమవారం జరిగిన వినుకొండ నియోజకవర్గం రేషన్ డీలర్ల సమావేశానికి చీఫ్ విప్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చౌక డిపో దుకాణాల ద్వారా ప్రతినెల సకాలంలో రేషన్ ప్రజ లకు సరఫరా చేయాలని సూచించారు. రేషన్ పంపిణీలో అవకతవకలు అక్రమాలకు పాల్పడితే ఆయా రేషన్ షాప్ ల లైసెన్సులను తొలగించడం జరుగుతుందని హెచ్చరించారు. పేదలకు అన్యాయం జరిగితే సహించేది లేదని, ఏ పార్టీ వారైనా, ఎంతటి వారైనా సరే చర్యలు తప్ప వన్నారు. ఎండియు వాహనాల నిర్వాహకుల సమస్యలు ఏమైనా ఉంటే తాసిల్దారులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. రేషన్ సరఫరా విషయంలో కొందరు నిర్లక్ష్యాన్ని వీడి ప్రవర్తన మార్చుకోవాల్సిందిగా హెచ్చరించడం జరిగిందని, విధివిధానాల్లో మార్పు లేకపోతే కఠిన చర్యలు తప్పవ న్నారు. రేనియోజవర్గంలోని రేషన్ డీలర్లు అందరూ ప్రభుత్వానికి సహకరించి నిబంధనల ప్రకారం ప్రతినెల రేషన్ సలపర సకాలంలో ప్రజలకు సరఫరా చేయాలని తెలిపారు. సమావేశంలో ఐదు మండలాల తాసిల్దారులు, రెవిన్యూ అధికారులు, రేషన్ షాప్ డీలర్లు పాల్గొన్నారు.

అమరావతి పునర్నిర్మాణ శంకుస్థాపన సభను జయప్రదం చేయండి : మంత్రి

విశాలాంధ్ర-పెదకాకాని: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో జరుగు అమరావతి పునర్నిర్మాణ శంకుస్థాపన సభను విజయవంతం చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యులు ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అధ్యక్షతన నియోజకవర్గ పార్టీ నాయకుల సమావేశం కాకాని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించటం జరిగింది. అమరావతి పునర్నిర్మాణ శంకుస్థాపన సభకు ముఖ్యఅతిథిగా భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రానున్న నేపథ్యంలో ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పొన్నూరు నియోజకవర్గ పరిశీలకులు, కందుకూరు నియోజకవర్గం శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు, పొన్నూరు నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

నవీన్ ఆశయాలు కొనసాగిద్దాం

చల్లా చిన ఆంజనేయులు, కోట మాల్యాద్రి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు నగర ఏఐఎస్ఎఫ్ పూర్వ అధ్యక్షులు, సీపీఐ నగర సమితి సభ్యులు అమర జీవి నవీన్ 4వ వర్ధంతి సభ సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లో నగర కార్యవర్గ సభ్యులు ఆకిటి అరుణ్ కుమార్ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి నవీన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏపీ ముఠా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు చల్లా చిన ఆంజనేయులు, సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రిలు మాట్లాడారు. నవీన్ తన తాత జీవీ కృష్ణారావు ఆశయాలను పుణికిపుచ్చుకొని పార్టీలో పనిచేస్తూ.. వ్యాపారాన్ని కొనసాగిస్తూ ఎదుగుతున్న తరుణంలో కరోనా మహమ్మారి 2021 ఏప్రిల్ 28న కబలించిందని ఆవేదన వ్యక్తం చేశారు. నవీన్ లేని లోటు అటు పార్టీకి, ఇటు కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు తీర్చలేనిదని అన్నారు. పార్టీలో పేద కార్యకర్తలకు సహాయ సహకారాలు అందిస్తూ ఉండేవారని, తలలో నాలుకల అందరి మన్ననలను పొందారని గుర్తుచేశారు. నవీన్ ఆశయాలను కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేడా హనుమంతరావు, నగర అధ్యక్షులు రావుల అంజిబాబు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జంగాల చైతన్య, కార్యదర్శి షేక్ వలి, ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ నగర కార్యదర్శి మంగా శ్రీనివాస్, సీపీఐ సీనియర్ నాయకులు నూతలపాటి చిన్న, కాయల రామారావు, సీపీఐ జిల్లా కార్యాలయ కార్యదర్శి రమణ, కార్పెంటర్స్ వర్కర్స్ యూనియన్ నాయకులు దేగల వెంకటేశ్వరరావు, సీపీఐ నగర సమితి సభ్యులు రాగం చంద్రమౌళి, దుపాటి వెంకటరత్నం, కోటి వీరాంజనేయులు, పీవీ జగన్నాథం, ఇరిగినేని వెంకటేశ్వర్లరావు, బి.తిరుమల, కూరాకుల రాంప్రసాద్, ఏడుకొండలు, సురేష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు తెలిపిన మక్కెన

విశాలాంధ్ర - వినుకొండ : గుంటూరు డి.సి.సి.బి. ఛైర్మన్‌గా తన నియామకానికి శాసనసభ్యులు, ప్రభుత్వ చీఫ్ విప్ జి.వి. ఆంజనేయులు, పార్లమెంటు సభ్యులు శ్రీ లావు శ్రీకృష్ణ దేవరాయలు కృషితో ముఖ్యమంత్రి చంద్రబాబు నియమించినందుకు వారికి మక్కెన మల్లికా ర్జున రావు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

'ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్' గా మార్పు

విశాలాంధ్ర-దుర్గి: ఆంధ్రప్రదేశ్ లోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్, ఆంధ్రప్రదేశ్ వికాస్ గ్రామీణ బ్యాంక్,సప్తగిరి గ్రామీణ బ్యాం క్, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ ఈ నాలుగు గ్రామీణ బ్యాంకులు మే నెల ఒకటో తేదీ నుంచి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్వహణ లో "ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ "గా ఏర్పడుతుందని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ దుర్గి బ్రాంచ్ మేనేజర్ వడ్డి శ్రీనివాస్ తెలిపారు. భారతప్రభుత్వ ఆదేశానుసారం జరగనున్న ఈమార్పును ప్రజలు, ఖాతాదారులు గమనించాలని కోరారు. ఖాతాదారుల ఖాతా సంఖ్యలో ప్రస్తుతానికి ఎటు వంటి మార్పు ఉండదని, .ఖాతాదారులు తమ లావాదే వీలను ఎటువంటి ఆటంకం లేకుండా నిర్వహించు కోవచ్చున్నారు. ఖాతా దారులకు అందించే సేవలలో నాణ్యత కొనసాగించ బడునని తెలియజేశారు. ఖాతా దా రుల కు ఏమైనా సందేహాలు ఉంటే ఖాతా గల శాఖను సంప్రదించగలరని తెలిపారు.

వేసవి విజ్ఞాన తరగతులు

విశాలాంధ్ర-ప్రత్తిపాడు : వేసవి విజ్ఞాన తరగతులు ప్రత్తిపాడు గ్రంధాలయ శాఖ గ్రంథాలయ అధికారి బి.అరుణ ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి బి.అరుణ మాట్లాడుతూ ప్రత్తిపాడు శాఖ గ్రంథాలయంలో ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు వేసవి విజ్ఞాన తరగతులు నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని విద్యార్థులు, విద్యార్థినీలు సద్వినియోగపరుచుకోవాలని ఆమె కోరారు. పిల్లలు ప్రతిరోజు గ్రంథాలయానికి వచ్చి పుస్తక పట్టణం, గ్రామర్, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, గేమ్స్ నేర్చుకోవాలని, సెల్ ఫోన్లకు దూరంగా ఉండాలని ఆమె సూచించారు. వేసవివిజ్ఞాన తరగతులలో 20 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

బాధితురాలికి ఎల్‌ఓసీ అందజేత

విశాలాంధ్ర-తాడేపల్లి : పట్టణం 14వ వార్డుకు చెందిన నేరిశెట్టి పద్మావతి అనారోగ్యంతో బాధ పడుతున్న నేపథ్యంలో అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ రూ.60 వేల ఎల్‌ఓసీ మంజూరు చేశారు. సోమవారం టీడీపీ నాయకులు బాధితురాలు పద్మావతి నివాసానికి వెళ్లి రూ.60 వేల విలువైన ఎల్‌ఓసీ మంజూరు పత్రాన్ని అందజేశారు. టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి ధారదాసు, మంగళగిరి నియోజకవర్గ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బూదాల రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF SURNAME

I, DAPPALA MAHESH REDDY (Old Name), S/o. KONDA REDDY, Resident of Door No.18-147/1, Lakshmi Narasimhapuram, Vengalayapalem, Guntur Rural, Guntur - 522005, Andhra Pradesh, India. I have changed my surname as DAPPILA MAHESH REDDY (New Name) S/o. KONDA REDDY. Hereafter my surname is known as DAPPILA MAHESH REDDY (New Name) S/o. KONDA REDDY.

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి: కలెక్టర్

విశాలాంధ్ర-నరసరావుపేట: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి బాధ్యతతో పని చేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి 168 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో డిఆర్ఓ, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులు సత్వరం పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి అర్జీకి అర్థవంతమైన సమాధానం ఇస్తూ త్వరితగతిన పరిష్కరించాలన్నారు.

ఈవీఎంల గోడౌన్ల పరిశీలన

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు నెలవారీ తనిఖీలో భాగంగా సోమవారం గుంటూరు కలక్టరేట్ ఆవరణలోని ఈవీఎంలు భద్రపరిచిన గోడౌన్‌ను జిల్లా సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ తనిఖీ చేసారు. ఈవీఎం గోడౌన్‌కు వేసిన తాళాలు సీళ్ళు, సీసీ టీవీ పనితీరు, అగ్నిమాపక పరికరాలను పరిశీలించారు. గోడౌన్ వద్ద భద్రత సిబ్బంది లాగ్ బుక్‌ను పరిశీలించారు. ఈవీఎంల భద్రత విషయంలో రాజీపడకుండా అవసరమైన అన్ని భద్రతా చర్యలు పకడ్బందీగా చేపట్టాలని అధికారులను జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాస రెడ్డి, కలెక్టరేట్ హెచ్ సెక్షన్ పర్యవేక్షకులు మల్లేశ్వరి, గుంటూరు పశ్చిమ మండల తహశీల్దార్ వెంకటేశ్వర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠాలు తొలగిస్తే చరిత్ర చెరిగిపోతుందా: రాంప్రసాద్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : మొఘలులు, ఢిల్లీ సుల్తానులు, ముస్లిం, ఇతర మైనార్టీ మతాల చరిత్ర, సంస్కృతిని చెరిపివేసే దిశగా నేడు జాతీయ విద్య, పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ)వారు వాళ్ళ చరిత్రని, సంస్కృతిని తెలియజేసే పాఠాలను చరిత్ర పుస్తకాల నుంచి తొలగించటం హేయమైన చర్య అని సోషల్ యాక్టివిస్ట్ చింతా రాంప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. విద్యా రంగంలో చోటు చేసుకుంటున్న ఇలాంటి పరిణామాలు పిల్లల్లో సత్యాన్వేషణ, విచక్షణా జ్ఞానం, సమాజంలో ఉత్తమ పౌరులుగా ఎదగటానికి గొడ్డలి పెట్టులాంటివన్నారు. మన దేశ జనాభాలో ముస్లింలు 14 శాతమని, ఈ దేశ చరిత్రలో 14 శాతం ఉన్న ముస్లింలు ఈ భౌగోళికతలో అంతర్భాగం కాదని ముస్లింలు ఆందోళన చెందరా? అని ప్రశ్నించారు. వారిలో ఇటువంటి భావం ఏర్పడడం వలన దేశ సమైక్యతకు, శాంతి భద్రతలకు, మెజారిటీ, మైనారిటీ ప్రజల మధ్య అనైక్యత దారి తీస్తాయన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

విశాలాంధ్ర-పెదకాకాని: గుంటూరు పట్టణంలోని కొరిటిపాడు వాస్తవ్యులు పూనూరు బసివిరెడ్డి, శైలజ దంపతులు పూనూరు మాల కొండారెడ్డి జ్ఞాపకార్థం సోమవారం దేవస్థాన నిత్య అన్నదాన పథకమునకు రూ.1,11,116లు విరాళం అందించినట్లు ఆలయ ఉప కమిషనర్, కార్యనిర్వహణాధికారి గోగినేని లీలా కుమార్ తెలిపారు. ఆలయ అభివృద్ధికి, నిత్య అన్నదాన పథకమునకు భక్తులు విరివిగా విరాళము సమర్పించి ఆలయ అభివృద్ధికి సహకరించవలసిందిగా ఉప కమిషనర్ భక్తులకు విజ్ఞప్తి చేసినారు. దాతలకు ప్రత్యేక దర్శనం, వేద ఆశీర్వచనం చేయించి శ్రీ స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి చిత్రపటం అందజేశారు.

చమళ్లమూడి రైతులకు న్యాయం చేయండి

కొల్లి రంగారెడ్డి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు జిల్లాలోని చమళ్లమూడి గ్రామ రైతుల సమస్య పరిష్కరించి వారికి న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి కోరారు. ఈ మేరకు కలెక్టర్ గ్రీవెన్స్‌లో సోమవారం బాధిత రైతులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన రీ సర్వేలో భాగంగా చమళ్లమూడిలో కూడా రీ సర్వే నిర్వహించారని, అక్కడి రైతులకు యాజమాన్య హక్కు పత్రాలు, పట్టాదారు పాసు పుస్తకాలు ఇచ్చారని గుర్తుచేశారు. అయితే ఎటువంటి విచారణ జరపకుండా, నోటీసులు కూడా జారీ చేయకుండా రైతులకు పట్టాలు ఉన్నా కూడా వారికి చెందిన సుమారు 900 ఎకరాల భూములను ఇనాం భూములుగా చూపించారన్నారు. ఫిబ్రవరి నెల నుంచి ఆన్‌లైన్ అడంగల్ తీసివేశారని, దీంతో రైతులకు 1బి, అడంగళ్లు మంజూరు కావటం లేదని, దాని వలన బ్యాంకు లోన్‌లు, భూ విక్రయాలు తదితరాలు ఆగిపోయి రైతులు ఆవేదన చెందుతున్నారని అన్నారు. దీనిపై చట్టపరంగా విచారణ చేయించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పీవీ జగన్నాథం, అధ్యక్షులు కంజుల విఠల్ రెడ్డి, బాధిత రైతులు ఎం.శివరామకృష్ణ, ఎ.నాగేశ్వరరావు, ఎం.చంద్రశేఖర్‌రావు, ఎం.పూర్ణచంద్రరావు, సిహెచ్ గోపినాథ్, ఎ.పాపారావు తదితరులు పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీలు నిర్మించాలి: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: పశ్చిమ నియోజకవర్గంలో వైద్య మౌలిక సదుపాయాలను పెంచి, కొత్త యూపీహెచ్‌సీలు నిర్మించి, శిథిలావస్థలో ఉన్న వాటికి మరమ్మతులు నిర్వహించాలని ఎమ్మెల్యే గల్లా మాధవి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్‌ను కోరారు. సోమవారం వెలగపూడిలోని సచివాలయంలో మంత్రి అందుబాటులో లేక పోవటంతో ప్రభుత్వ ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి కృష్ణబాబుకు వినతి పత్రాన్ని అందజేశారు. పెరుగుతున్న జనాభాకు తగ్గట్టు తగినని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు లేవు, నియోజకవర్గంలో 8 అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు మాత్రమే ఉన్నాయి. కాబట్టి జనాభా వేగంగా పెరుగుతున్న ఏటీ అగ్రహారం, కోబాల్ట్‌పేట ఎస్‌వీఎన్ కాలనీ వంటి ప్రాంతాల్లో కొత్తవి నిర్మించాలి. అదేవిధంగా ఎన్జీవో కాలనీ మరియు భాగ్య నగర్ (తుఫాన్ నగర్) మరియు మల్లికార్జునపేటలలో ఉన్న యూపీహెచ్‌సీలు శిథిలావస్థలో ఉన్నాయి. కాబట్టి వెంటనే గుంటూరు పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గంలో వైద్య సౌకర్యాల అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు, అవసరమయిన నిధులు మంజూరు చేయాలని ఆమె కోరారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : చిన్నారులు పుస్తక పఠనం అలవర్చుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, పౌర గ్రంథాలయ సంచాలకులు ఎ.కృష్ణ మోహన్ అన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన తరగతులు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గుంటూరులోని జిల్లా కేంద్ర గ్రంథాలయం సమావేశ మందిరంలో మొదటి రోజు జరిగిన తరగతులకు ముఖ్యఅతిథులుగా విచ్చేసిన గోనుగుంట్ల కోటేశ్వరరావు, ఎ.కృష్ణ మోహన్‌లు మాట్లాడుతూ 40 రోజుల పాటు జరిగే ఈ వేసవి విజ్ఞాన తరగతులను చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి రోజూ గ్రంథాలయానికి విచ్చేసి పుస్తక పఠనం, గ్రామర్, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, పెయింటింగ్, పప్పెట్ మేకింగ్, పేపర్ క్రాఫ్ట్ నేర్చుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని చెప్పారు. గ్రంథాలయాలు, పుస్తకాల ఆవశ్యకత గురించి తెలియజేశారు. సుమారు 60 మందికి పైగా విద్యార్థులు పాల్గొనగా ఉపాధ్యాయులు శ్రీనివాస నాయక్ మోటివేషన్, జీకే తరగతులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ, ఉపగ్రంథపాలకురాలు కె.ఝాన్సీ లక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ ఎం.సీతారామయ్య, లైబ్రేరియన్స్ కె.చిన్నపరెడ్డి, ఎస్.నాగిరెడ్డి, ఐవీ దుర్గారెడ్డి, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌కు పరికరాలు, సిబ్బంది మంజూరు చేయాలి: నసీర్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ప్రతిరోజు వేలాది మంది రోగులకు సేవలందిస్తున్న గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రికి పరికరాలు, సిబ్బందిని మంజూరు చేయాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి కన్నబాబును కోరారు. సోమవారం ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ఇతర ఆసుపత్రుల్లో వినియోగంలో లేని వైద్య పరికరాలను గుంటూరు జీజీహెచ్‌కి తరలించి సేవల వినియోగాన్ని మెరుగుపర్చాలని కోరారు.

క్రీడలకు అధిక ప్రాధాన్యం

విశాలాంధ్ర-పెదకాకాని: నేటి సమాజంలో క్రీడలకు అధిక ప్రాధాన్యత ఉందని ప్రభుత్వం క్రీడాకారులకు అనేక ప్రోత్సాహకాలు అందిస్తుందని ఇండియన్ ఆర్చరీ క్రీడాకారుడు కొండూరు వెంకటాద్రి అన్నారు. వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నోలాజికల్ యూనివర్శిటీ నిర్వహించిన క్రీడా దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అంతర్ కళాశాల నందు నిర్వహించిన క్రీడా పోటీలలో విజేతలకు వివిఐటియూ చాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్‌తో కలసి పురస్కారాలు, ప్రశంస పత్రాలను అందించారు. వివిఐటియూ నుండి వివిధ జాతీయ అంతర్జాతీయ జట్లకు ఎంపిక కాబడ్డ విద్యార్థులను ఆయన అభినందించారు. ముఖ్య అతిథి కె. వెంకటాద్రి మాట్లాడుతూ క్రీడలలో రాణించిన వారు చదువులో కూడా ముందజలో ఉంటారని అన్నారు. క్రీడలు మానసిక సంతోషం కోసం ఆడాలని సూచించారు. ప్రిన్సిపాల్ డా.వై. మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ క్రీడలు చదువులో భాగమనీ, క్రీడలను విద్యార్థులకు తప్పనిసరి అని తెలిపారు. క్రీడలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అకడమిక్స్ డీన్ డా.కె. గిరిబాబు, డీన్ డా.కె. సత్యన్నారాయణ, ఫిజికల్ డైరెక్టర్స్ డా.ఎన్.అరుణ్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-నరసరావుపేట: అనేక ఉద్యమాల ద్వారా పోరా టాలు చేసి సాధిం చుకున్న విద్యా హక్కు చట్టాన్ని అందరూ ఉపయోగించుకోవాలని సీపీఐ కార్యవర్గ సభ్యులు ఉలవపూడి రాము కోరారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థల్లో 25శాతం ప్రవేశాల్లో భాగంగా ఒకటవ తరగతి చదువుతున్న విద్యార్థులు ఎంఈవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ నెల 28వ తేదీనుండి మే 15వ తేదీ వరకు ఎంఈఓ కార్యాలయంలో అడ్మిషన్లు తీసుకోవడం జరుగు తుందని వెల్లడించారు. పేద విద్యార్థులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించాలన్నారు. దీనివల్ల పదో తరగతి వరకు 25శాతం ఎలాంటి రుసుము లేకుండా విద్య పేదలకు అందుతుం దని వారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాసా రాంబాబు, సీపీఐ ఏరియా కార్యదర్శి సిహెచ్ సత్యనారాయణ రాజు, ప్రసన్న కుమార్, గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలకు యూనిఫామ్ అందజేత

విశాలాంధ్ర-గుం టూరు వైద్యం : జిల్లాలో పని చేస్తున్న 1195 మంది ఆశా కార్యకర్తలకు రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిన యూనిఫామ్‌లను గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డిఎంహెచ్ఓ)డాక్టర్ కొర్ర విజయలక్ష్మీ సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఐఓ ఏటిఓ డాక్టర్ దాసరి శ్రీనివాసులు, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ అన్నపూర్ణ, పిఒఎన్‌సిడి డాక్టర్ రోహిణి రత్నశ్రీ, డిసి డాక్టర్ విజయ ప్రకాష్, డాక్టర్ జయ రామకృష్ణ, డాక్టర్ ప్రియాంక, చంద్రశేఖర్, సురేష్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మేడే వేడుకలు జయప్రదం చేయాలి

విశాలాంధ్ర-తాడేపల్లి: ప్రపంచ కార్మికులారా ఏకం కండి పోరాడితే పోయేదేమీ లేదు, బానిస సంకెళ్ళు తప్ప కార్మిక వర్గాన్ని కట్టు బానిసత్వానికి గురిచేసే లక్ష్యంతో బీజేపీ సర్కార్ తెచ్చిన లేబర్ కోడ్ల రద్దుకై పోరాడాలని అంతర్జాతీయ కార్మిక వర్గ పోరాట దీక్షాదినం మేడే ను చికాగో కార్మిక అమర వీరుల స్ఫూర్తితో వాడవాడలా జయప్రదం చేయాలని ది మంగళగిరి ఏరియా ఆటో డ్రైవర్స్ అండ్ ఓనర్స్ యూనియన్ నాయకులు కోరారు. సోమవారం తాడేపల్లి నులకపేట యూనియన్ నాయకులు కర పత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని కార్మికవాడలలో, ఆటోస్టాండ్లలో మేడే జెండా ఆవిష్కరణలు ర్యాలీలు, సభలు నిర్వహించి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు షేక్ శ్రీను, కార్యదర్శి షేక్ సైదా, ఉపాధ్యక్షుడు జాన్ సైదా, కోశాధికారి శ్రీను, గౌరవ అధ్యక్షులు కొండారెడ్డి, వినయ్, రామారావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు

పేద విద్యార్థిని ఉన్నత విద్యకు ఆర్థిక సాయం

విశాలాంధ్ర-మచిలీపట్నం: మైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన ఒక పేద విద్యార్థినికి 28,500 రూపాయల ఆర్థిక సాయం సోమవారం అందించారు.స్థానిక భాస్కరపురం ప్రాంతానికి చెందిన నాంపల్లి విజయ్ కుమార్,వాహిని దంపతుల కుమార్తె మహాలక్ష్మి ఇటీవల వెలువడిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో 950 అత్యుత్తమ మార్కులు సాధించింది. సి. ఎ, (చార్టెడ్ అకౌంటెంట్) చదవాలనే తన కలను నిజం చేసుకొనుటకు గాను ఆర్థిక సాయం చేసే దాతల కోసం ఎదురుచూస్తూ మైత్రీ ఫౌండేషన్ గౌరవ సభ్యులు చదలవాడ దివాకర్ (ప్రస్తుతం కెనడా లో ఉంటారు)ని సంప్రదించగా వారు వెంటనే స్పందించి పేద విద్యార్థిని గుంటూరు మాస్టర్ మైండ్స్అకాడమీ లో చేరుటకుగాను 28,500 ఆర్థిక సాయం ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేయమని కోరగా చెక్ ద్వారా ఆ విద్యార్థినికి అందించడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థి తల్లితండ్రులు దాత చదలవాడ దివాకర్ కి , మైత్రి ఫౌండేషన్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రెసిడెంట్ కె. వేణుకుమార్, గౌరవ అధ్యక్షులు వరప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ రిలాక్స్ ప్రసాద్, సెక్రెటరీ రాధా కృష్ణ, జాయింట్ సెక్రెటరీ దీప్తి, ట్రెజరర్ కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లైమేట్‌సేఫ్ ను ఆవిష్కరించిన బజాజ్ అలియంజ్ జనరల్ ఇన్సూరెన్స్

విశాలాంధ్ర-విజయవాడ: భారతదేశంలోని ప్రముఖ ప్రైవేట్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలలో ఒకటైన బజాజ్ అలియంజ్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ దాని వినూత్నమైన పారామెట్రిక్ ఇన్సూరెన్స్ ప్రోడక్ట్ 'క్లైమేట్‌సేఫ్' ప్రారంభించింది. ఈ సందర్భంగా బజాజ్ అలియంజ్ జనరల్ ఇన్సూరెన్స్ ఎండి డాక్టర్ తపన్ సింఘేల్ మాట్లాడుతూ వాతావరణ సంబంధిత ప్రమాదాలు పెరుగుతున్న తరుణంలో, వాతావరణ మార్పుల వల్ల గణనీయమైన ప్రభావానికి లోనైన వారికి ఆర్థిక రక్షణను అందించడానికి ఈ ప్రోడక్ట్ రూపొందించబడిందన్నారు. పరిశ్రమలోనే మొట్టమొదటి క్లైమేట్ రిస్క్ పాలసీ అయిన ఈ ఇన్సూరెన్స్ ప్రత్యేకంగా రిటైల్ కస్టమర్లు, ఆఫీసుకు వెళ్లే వారు, ఆటో/టాక్సీ డ్రైవర్లు, రిటైల్ షాప్ యజమానులు, డెలివరీ ఏజెంట్లు, హోమ్ సర్వీస్ ప్రొఫెషనల్స్, గిగ్ కార్మికులు, ఇంట్లో నివాసించేవారు మరియు తీవ్రమైన వేడి, చల్లని గాలులు మరియు అత్యధిక వర్షపాతంతో సహా వాతావరణ సంబంధిత ప్రమాదాల కారణంగా వాతావరణ సంబంధిత ఆదాయ నష్టం లేదా పెరిగిన ఖర్చులను ఎదుర్కొనే వారి అవసరాలను తీర్చడానికి రూపొందించబడిందన్నారు. బజాజ్ అలియంజ్ క్లైమేట్‌సేఫ్ ఇన్సూరెన్స్ అనేది అధిక విద్యుత్ వినియోగం వల్ల పెరిగిన ఖర్చులు, ఊహించని ప్రయాణ ఖర్చులు, ప్రతికూల వాతావరణ సమయంలో తక్కువ కస్టమర్ల వల్ల తక్కువ అమ్మకాలు, వరదల వల్ల సరఫరా గొలుసు ఆలస్యాలు, సుదీర్ఘమైన వర్షపాతం వల్ల ఏర్పడిన లీకేజీలు, అత్యధిక వర్షం కారణంగా జరిగే ప్రమాదాలు, ప్రతికూల వాతావరణం కారణంగా రోజువారీ వేతన కార్మికులు ఆదాయం కోల్పోవడం, వరదలు మరియు వేడి గాలుల వల్ల గృహోపకరణ వస్తువులకు నష్టం మరియు ప్రతికూల వాతావరణం కారణంగా కార్యక్రమాల రద్దు మొదలైన ఖర్చులను కవర్ చేస్తుందని చెప్పారు.

'మీకోసం'లో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమంలో ప్రజల నుండి జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్, డీఆర్ఓ కే. చంద్రశేఖర రావు, కేఆర్ఆర్‌సి డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి అర్జీలను స్వీకరించారు. ప్రజల నుండి స్వీకరించిన అర్జీలను సంబంధిత అధికారులు సత్వరమే పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ సూచించారు.

20న దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయండి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఫాసిస్టు పెట్టుబడిదారీ విధానాన్ని వ్యతిరేకంగా, నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని భారత విప్లవ కమ్యూనిస్టు పార్టీ (ఆర్.సి.పి.ఐ) రాష్ట్ర కార్యదర్శి రంబాల సతీష్ పిలుపునిచ్చారు.సోమవారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన నడుస్తుందని రోజురోజుకు ప్రజల కొనుగోలు శక్తి నశించిపోతుందని, ముఖ్యంగా మన రాష్ట్రంలో ప్రజలపై అప్పుల భారం పెరుగుతుందన్నారు.ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచే విధానాలను అవలంబించకుండా కేవలం బిజెపి దాని ఫాసిస్టు పెట్టుబడిదారులకు అనుకూలంగా అనుసరిస్తున్న విధానాలను తిప్పికొట్టకపోతే రానున్న రోజుల్లో ఆంధ్రప్రదేశ్ ప్రజలు మరింత దుర్భర స్థితిని ఎదుర్కొనే పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాశ్మీర్ పెహల్గామ్‌లో జరిగిన దుర్ఘటనకు ముమ్మాటికీ నరేంద్ర మోడీ, బిజెపి ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని తప్పా ప్రజా సమస్యలు ప్రక్కదోవ పట్టేలా జాతీయ వాదాన్ని ముందుకు తీసుకువచ్చి సమస్యను మరింత జఠిలం చేయవద్దు అని సూచించారు. వక్ఫ్ బోర్డ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని,ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హోదా ఇవ్వాలని,నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని,నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని, ఎన్డీఏ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలన్నీ నెరవేర్చాలని తదితర డిమాండ్ల సాధనకు దేశవ్యాప్తంగా జరిగే సమ్మెలో మే 20న కార్మికులు, రైతులు, విద్యార్థులు మహిళలు దోపిడీకి గురవుతున్న అన్ని వర్గాల ప్రజలు ఈ సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని రాష్ట్ర కమిటీ తరుపున పిలుపునిస్తున్నదన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి బాలకృష్ణ, ఎం నాగమణి,శివకోటి రాజు,జి.రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్షయ తృతీయ వేళ 'సొనాటా గోల్డ్'ను ఆవిష్కరించిన సొనాటా

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట : భారతదేశంలో ఎక్కువమంది అభిమానించే వాచ్ బ్రాండ్ అయిన సొనాటా, అద్భుతమైన సొనాటా గోల్డ్ కలెక్షన్ ను పరిచయం చేసిందని సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. వ్యక్తిగత శైలి ప్రకటనగా , సొనాటా గోల్డ్ బంగారంపై మీ ప్రేమను ధరించడానికి ఒక ఆకర్షణీయమైన కొత్త మార్గాన్ని అందిస్తుందన్నారు. సంపద సానుకూల ప్రారంభాలతో ముడిపడి ఉన్న సమయం, అక్షయ తృతీయ, సమీపిస్తున్న కొద్దీ, సొనాటా గోల్డ్ బంగారు బహుమతిపై తాజాగా ఆధునిక దృక్పథాన్ని అందిస్తుందన్నారు. ఈ కలెక్షన్ లోని ప్రతి టైమ్‌పీస్ దాని డయల్‌లో అమర్చబడిన నిజమైన 0.15%గ్రా% 22 క్యారట్స్ తనిష్క్ గోల్డ్ కాయిన్‌ను కలిగి ఉంది, ఇది పనితనం , వారసత్వం మరియు డిజైన్ గురించి ఎన్నో అంశాలను వెల్లడిస్తోందన్నారు. సొనాటా బ్రాండ్ హెడ్ ప్రతీక్ గుప్తా మాట్లాడుతూ, "సొనాటా గోల్డ్ కేవలం వాచ్ కాదు - ఇది ఒక అనుభవమన్నారు. ఈ గడియారాలు డిజైన్‌కు విలువనిచ్చే వారి కోసం తీర్చిదిద్దబడ్డవి. మీ కోసం లేదా మీరు ఇష్టపడే వ్యక్తి కోసం బంగారం యొక్క సూక్ష్మమైన కానీ బలమైన వ్యక్తీకరణ ఇది" అని అన్నారు. సొగసైన వేరియంట్‌లలో ఈ కలెక్షన్ లభిస్తుందన్నారు. రూ. 5,695 నుండి రూ. 5,995 మధ్య ధరతో, శాశ్వత శైలి గా మీ కోసం ఎంచుకున్నా లేదా మీరు ఇష్టపడే వ్యక్తి కోసం ఆలోచనాత్మక గుర్తుగా ఎంచుకున్నా, సొనాటా గోల్డ్ ఈ పండుగ సీజన్‌లో ఆదర్శవంతమైన బహుమతిగా ఉంటుందన్నారు

గ్రంథాలయ వేసవి శిక్షణ శిబిరం

విశాలాంధ్ర-ఉయ్యూరు : ఉయ్యూరు శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాన్ని జడ్పీ హైస్కూల్ ప్రధానోపా ధ్యాయుడు పి. శ్రీనివాస రావు. బీఎస్ఎన్ఎల్ రిటైర్డు ఇంజనీరు వెల్లంకి కృష్ణప్రసాద్ సో మవారం ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లా డుతూ, విద్యార్థులకు వేసవిశెలవుల్లో గ్రంథాలయంలో నెలరోజులకు పైగా వివిధ అంశాల్లో ఇచ్చే శిక్షణ సద్వినియోగం చేసు కుని విజ్ఞానం సంపాదించుకోవాలన్నారు. పుస్తక పఠనంలో భాగంగా దేశనాయకులు, చరిత్రకారుల గురించి తెలుసుకుని క్రమశిక్షణతో ఉన్నత స్థాయికి

చేరుకోవాలన్నారు. వార్డు కౌన్సిలర్ కోరాడ వెంకటలక్ష్మి, సిద్ధార్థ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. సాంబ శివరావు, గ్రంథాలయ అధికారి బి. రమణి ప్రవంతి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

జనసేనపార్టీ గుర్తింపు కార్డుల పంపిణీ

విశాలాంధ్ర-పామర్రు : జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం విచ్చేసిన బృందం పామర్రు జనసేన పార్టీ ఇంచార్జ్ తాడిశెట్టి నరేష్ ద్వారా క్రియాశీల వాలంటీర్లకు సోమవారం ఐడి కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగాతాడిశెట్టి నరేష్ మాట్లాడుతూ క్రియాశీలక సభ్యత్వ ఐడీ కార్డ్ వాలంటీర్ వారిగా సులభతరంగా ప్రతి కార్యకర్తకి అందే విధంగా ఎంతో శ్రమ పడి కేంద్ర కార్యాలయం నుండి పంపినందుకు జనసేన పార్టీ అధ్యక్షులుకొణిదెల పవన్ కళ్యాణ్ కు ధన్యవాదాలు తెలిపారు...ప్రతి వాలంటీర్ కూడా ఈ సభ్యత్వ కార్డులు, ప్రతి కార్యకర్తకు అందే విధంగా చూడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో క్రియా శీలక వాలంటీర్లు, మండల అధ్యక్షులు జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు

రెన్యూఎక్స్ 2025లో అడ్వాన్స్‌డ్ సోలార్ మాన్యుఫ్యాక్చరింగ్ సొల్యూషన్స్‌ను ప్రదర్శించింది

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట: సాత్విక్ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ ఏప్రిల్ 23-25 వరకు నందంబాక్కంలోని చెన్నై ట్రేడ్ సెంటర్‌లో జరిగిన రెన్యూఎక్స్ 2025లో పాల్గొందని సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కంపెనీ పాలీక్రిస్టలైన్ సెల్ టెక్నాలజీ, మోనోక్రిస్టలైన్ సెల్ టెక్నాలజీ, బైఫేషియల్ టెక్నాలజీ, ఎం 12 టెక్నాలజీ అధునాతన టన్నెల్ ఆక్సైడ్ పాసివేటెడ్ కాంటాక్ట్ ("టాప్‌కాన్") టెక్నాలజీ ఆధారంగా మాడ్యూల్‌లను అందిస్తుందన్నారు. ఇది శక్తి నష్టాన్ని తగ్గించడంలో సహాయపడుతుందన్నారు. ఇవి నివాస, వాణిజ్య యుటిలిటీ-స్కేల్ ప్రాజెక్టులకు సరిపోయే మోనోఫేషియల్ బైఫేషియల్ ఎంపికలలో అందుబాటులో ఉన్నాయన్నారు. కంపెనీ ప్రస్తుతం హర్యానాలోని అంబాలాలో మూడు మాడ్యూల్ తయారీ సౌకర్యాలను నిర్వహిస్తోందన్నారు. మొత్తం 724,225 చదరపు అడుగుల విస్తీర్ణంలో విస్తరించి ఉన్నాయన్నారు. ఇవి కలిసి భారతదేశంలో అతిపెద్ద సింగిల్ లొకేషన్ మాడ్యూల్ తయారీ సౌకర్యాలలో ఒకటిగా ఏర్పడ్డాయన్నారు. కంపెనీ భాగస్వామ్యం గురించి సాత్విక్ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ సి యి ఓ ప్రశాంత్ మాథుర్ మాట్లాడుతూ , వేగంగా అభివృద్ధి చెందుతున్న దక్షిణ భారత సోలార్ మార్కెట్‌తో నిమగ్నమవ్వడానికి రెన్యూఎక్స్ ఒక కీలకమైన వేదికను అందించిందన్నారు. ఈ కంపెనీ వివిధ విభాగాలలో (పెద్ద యుటిలిటీ, వాణిజ్య పారిశ్రామిక, ఓపెన్ యాక్సెస్, రెసిడెన్షియల్ రూఫ్‌టాప్, సోలార్ పంప్) భౌగోళిక ప్రాంతాలలో (భారతదేశం, ఉత్తర అమెరికా, ఆఫ్రికా మరియు దక్షిణాసియాలోని అన్ని ప్రాంతాలలో అమ్మకాలు) ఉనికితో పరిశ్రమలో అత్యంత వైవిధ్యభరితమైన క్లయింట్ స్థావరాలలో ఒకటన్నారు.

మాచర్ల మున్సిపల్ 1వ వైస్ చైర్మన్‌గా షేక్ మధార్ సాహెబ్ ఏకగ్రీవం

విశాలాంధ్ర- మాచర్ల : మాచర్ల మున్సిపల్ 1వ వైస్ చైర్మన్ గా 27వ వార్డుకు చెందిన షేక్ మధార్ సాహెబ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు రిటర్నింగ్ అధికారి ఆర్డీవో మురళీకృష్ణ తెలిపారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఆర్డీవో మురళి కృష్ణ చేతుల మీదుగా మధార్ సాహెబ్ కు డిక్లరేషన్ పత్రాన్ని అందుకున్నారు. అబ్జర్వర్ గా జాయింట్ కలెక్టర్ సూరజ్ వ్యవహరించారు. మధార్ సాహెబ్ ఎన్నికకు 17వ వార్డు కౌన్సిలర్ పోలూరి నరసింహారావు ప్రతిపాదించగా 1వ వార్డు కౌన్సిలర్ అరుణ కుమారి, 21 వ వార్డు కౌన్సిలర్ ముదిశెట్టి శ్రీనివాసరావు బలపరిచారు. మధార్ సాహెబ్ కు 16 మంది టిడిపి కౌన్సిలర్లు మద్దతు పలుకగా 19వ వార్డ్ బత్తిన హైమావతి, 4వ వార్డు రామిశెట్టి వెంకటేశ్వర్లు, 14వ వార్డు చవ్వా అనిత, 31వ వార్డ్ షేక్ తహనీయత్ బేగం కౌన్సిలర్లు మద్దతు పలికారు. కార్యక్రమంలో ఎమ్మార్వో బి కిరణ్ కుమార్, కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన మంత్రి సురక్ష యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-దుర్గి: ఏపీ ప్రజలకు ఆంధ్రప్రదేశ్ రా ష్ట్ర ప్రభుత్వం శుభవార్త చె ప్పిందని దుర్గి మండల ఏ. పి. ఓ. మల్లిఖార్జున రావు సోమ వారం జరిగిన పీల్డ్ అసిస్టెంట్ల సమావేశం లో పేర్కొన్నారు. ప్రధాన మంత్రి సురక్షా యోజ న పథకం (ప్రమాద భీమా సౌక ర్యం) ఒక వరమని పేర్కొన్నారు. .18సం లు నిండి 70సం. రాల లోపు వయస్సు గల వారు ఈ పథకంనకు అర్హులని వెల్లడించారు. ప్రతి సంవత్సరం ఒకవ్యక్తి రూ. 20లు ప్రీమియం చెల్లిస్తే, ఒక వేళ ఆ వ్యక్తి ప్రమాదవశాత్తు మరణి స్తే 2ల క్షల వరకు ప్ర మాద భీమా వర్తిస్తుందన్నారు. 18సం ల నుండి 50సంవత్సరాల వయస్సు గల ప్రతి ఒక్కరూ రాష్ట్రీయ స్వస్థ భీమా యోజనపథకం కింద ఏడాదికి రూ 450లు ప్రీమి యం చెల్లిస్తే పలు రకాల ప్రమా ద భీమా లభిస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్ లో 1.20కోట్ల మం ది ఉపాధి హామీ పథకం కింద పనిచేసే కూలీలందరికి ప్రమాద భీమా సౌకర్యం కల్పిం చాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీ ణఅభివృద్ధి శాఖా నిర్ణయిం చిందన్నారు.మే ఒకటవ తేదీ నాటికీ కూలీల నుంచి దరఖాస్తులను స్వీక రించి బ్యాంకు ల్లోనమోదు చేయించేలా పీల్డ్ అసిస్టెంట్ లను సిద్ధం చేయాలన్నారు.

గంగమ్మ తల్లి తిరునాళ్లకు జంగాకు ఆహ్వానం

విశాలాంధ్ర - పిడుగురాళ్ల : పిడుగురాళ్ల గ్రామ దేవత గంగమ్మతల్లి తిరుణాళ్ళ మహొత్సవానికి రావాలంటూ టిటిడి సభ్యులు జంగా కృష్ణమూర్తిని ఉత్సవ కమిటీ ఆహ్వానం అందించింది. ఈ మేరకు ఆయన స్వగ్రామమైన గామలపాడులో దేవస్థానఉత్సవ కమిటీ సభ్యులు జంగానుకలిశారు. మే 2నుండి ప్రారంభం కానున్న గంగమ్మ తల్లి తిరుణాళ్ళ మూడు రోజులు జరగనుందని వివరించారు. అమ్మవారి జన్మదినం సందర్భంగా ఈ ఏడాది నుండి వేడుకలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. వేడుకలకు హాజరు కావాలని టిటిడి సభ్యులు జంగా కృష్ణమూర్తిని కోరుతూ శాలువాతో సత్కరించారు. అనంతరం పిడుగురాళ్ల జెడ్పిటిసి సభ్యులు జంగా వెంకట కోటయ్య కలిసి ఆహ్వాన పత్రిక అందించారు. తర్వాత పిడుగురాళ్ల పట్టణంలోని ఆర్యవైశ్య ప్రముఖులు వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి పాలకమండలి సభ్యులు మరియు బిజెపి జిల్లా అధ్యక్షులు శశి కుమార్ ను గంగమ్మతల్లి ఉత్సవ కమిటీ కలిసి వేడుకలకు ఆహ్వానించారు.

ఈదులమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవ వేడుకలు

విశాలాంధ్ర- రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్లలో వేంచేసియున్న శ్రీ ఈదులమ్మ తల్లి ఆలయ 26వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. గౌడ కులస్థుల కుల దైవమైన శ్రీ ఈదులమ్మ తల్లి ఆలయాన్ని ఆ కులస్తులు అందంగా అలంకరించారు. ఆలయపూజారి పేటేటి అంకారావు అమ్మవారిని అందంగా, ప్రత్యేకముగా అలంకరించి పూజలు నిర్వహించారు. గౌడ కులస్థుల తో పాటు గ్రామస్థులు, మహిళలు, భక్తులు అధికసంఖ్యలో ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక ప్రత్యేక పూజలు నిర్వ హించారు.

రెండు రాష్ట్రాలకు దక్కిన నాలుగు పళ్ల ఎడ్ల పోటీ ఫలితం

విశాలాంధ్ర - దాచేపల్లి : ఏపీలోని పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గం దాచేపల్లిలో శ్రీవీర్ల అంక మ్మతల్లి దేవస్థానం 25వ కొలుపుల తిరునాళ్ళలో భాగంగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఏపీతో పాటు రెండు రోజులుగా తెలంగాణ రాష్ట్రం నుంచి కూడా ఎడ్ల జతలు వచ్చాయి. వాటిలో ఆదివారం రాత్రి నిర్వహించిన నాలుగు పళ్ళ ఎడ్ల జతల పోటీలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ఎనిమిది జతల ఎడ్లు పాల్గొన్నాయి. అందులో తెలంగాణలోని సూర్యాపేట జిల్లా మఠంపల్లి ప్రాంతానికి చెందిన గాదె సుందరమ్మ బాల్ రెడ్డి, గాదె ఆషేర్ సుమణ్వి రెడ్డి, ఎన్టీఆర్ జిల్లా చందర్ల పాడు మండలం తుర్లపాడు గ్రామానికి చెందిన ఏఎన్ బుల్స్ పోపూరి ఆదినారాయణ (కంబైన్డ్) ఎడ్లు ప్రధమ స్థానంలో నిలిచాయి. నంద్యాల జిల్లా గడివేముల మండలం గడిగరేవుల గ్రామం లోని పెరుమాళ్ళ సంజయ్ కుమార్ ఎడ్లకు ద్వితీయం, గుంటూరు జిల్లా పెదకాకాని మండలం తక్కెళ్ళ పాడుకు చెందిన మోపర్తి వెంకటేశ్వరరావు, మోపర్తి నవీన్ కుమార్ ఎడ్లకు తృతీయం, పల్నాడు జిల్లా దాచేపల్లి గ్రామీణ మండలం కేసానపల్లిలోని నెల్లూరి రామకోటయ్య ఎడ్లకు నాలుగో స్థానం, పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం విస్సన్నపా లెంలోని భాష్వికా రెడ్డి, జ్ఞాన్విత్ రెడ్డి ఎడ్లకు ఐదో స్థానం, పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం భీమవరానికి చెందిన పసుమర్తి దివ్యశ్రీ ఎడ్లకు ఆరో స్థానం లభించింది. బాపట్ల జిల్లా ఇంకొల్లు మండలం పూసపాడులోని ఏలూరి లిఖిత చౌదరి, సూది జ్యోత్స్న సాయి ఎడ్లకు ఏడో స్థానం, బాపట్ల జిల్లా యద్దనపూడి కి చెందిన ఖాదర్ మస్తన్ మేస్త్రి బుల్స్‌కు ఎనిమిదో స్థానం దక్కింది. వీరందరికీ సోమవారం నగదు బహుమతులు ఇచ్చారు. వారిలో మేడితి నరసింహారావు రూ 25 వేలు, కొప్పుల నరసింహారావు, కొప్పుల శ్రీనివాసరావు రూ 20 వేలు, శ్రీహనుమాన్ మెడికల్ స్టోర్ నుంచి రూ 15 వేలు, కానుకొల్లు ప్రశాంత్, లవ్, గిరి (పద్మాలయా స్టూడియో) రూ 10 వేలు, కూరాకుల దిలీప్ కుమార్ (అలంకార్ థియేటర్) రూ 7 వేలు, బొమ్మిరెడ్డి వెంకట నారాయణ రూ 5 వేల చొప్పున నగదు బహుమతులు అందజేశారు. మునగా పెద ఆదినారాయణ, మునగా చిన ఆదినారాయణ షీల్డులను బహుకరించినట్లు న్యాయ నిర్ణేత గూడా శ్రీనివాసరావు చెప్పారు.

ఆరు పళ్ళ ఎడ్ల పోటీలు ప్రారంభం....

సోమవారం రాత్రి ఆరు పళ్ళ ఎడ్ల జత పోటీలు ప్రారంభమయ్యాయి. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి తొమ్మిది జతల ఎడ్లు వచ్చాయి. ఈ పోటీలను పలువురు నాయకులు ప్రారంభించారు. దేవస్థానం అభివృద్ధి కమిటీ, ఎడ్ల పోటీల నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. నాలుగు రోజుల నుంచి జరుగుతున్న ఈ ఎడ్ల పోటీలను నిత్యం వేలాది మంది ప్రజలు, రైతులు తిలకిస్తున్నారు. ఈ నెల 30 వరకు ఈ ఎడ్ల పోటీలు జరుగుతాయి.

పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సీబీఐ దర్యాప్తు జరిపించాలి

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: పాస్టర్ ప్రవీణ్ మృతి విషయంలో హైకోర్టు జడ్జి పర్యవేక్షణలో సీబీఐ దర్యాప్తు జరపాలని, పాస్టర్లు క్రైస్తవులు చర్చిల రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలని, గుంటూరు నగరంలో క్రైస్తవ సమాధుల తోటలకు స్థలాల మంజూరు చేయాలని కోరుతూ క్రైస్తవ ఐక్యకార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టర్ కార్యాలయం ఎదుటు చేస్తున్న రిలే నిరాహార ప్రార్థన దీక్షలు సోమవారం ఆరవ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో రాజమండ్రి నుంచి వచ్చిన క్రైస్తవ నాయకులు జాన్ బెన్నీ లింగం, గుంటూరు పట్టణానికి చెందిన క్రైస్తవ నాయకులు హేబెల్ సందర్శించి ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ ప్రగడాలది ముందస్తు పన్నాగంతో కూడిన హత్య అని అన్నారు. ముఖ్యంగా భారతదేశంలో సువార్తను అడ్డుకోవాలని, క్రైస్తవ సమాజాన్ని అంతం చేసేందుకు ప్రణాళికతో ముందుకు సాగుతున్న క్రైస్తవ వ్యతిరేక శక్తులను అడ్డుకునేందుకు అందరూ ఐక్యతతో సాగాలని అన్నారు. ఇది లౌకిక రాజ్యాంగానికి తుట్లు పొడుస్తున్న రాజ్యాంగ వ్యతిరేక శక్తులను ఎదుర్కొనేందుకు క్రైస్తవాలు, ముస్లింలు ఒకే వేదిక పైకి వచ్చి పోరాడాలని అన్నారు. తదుపరి కలెక్టరేట్ మెయిన్ గేట్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించి పెద్దపెట్టున నినాదాలు చేసారు. అనంతరం డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని సామాజికవేత్త డాక్టర్ గోళ్ళమూడి రాజసుందర్ బాబు, మార్కు రతన శ్రీలు గుంటూరు జిల్లా రెవెన్యూ అధికారి కి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమాన్ని జాతీయ దళిత క్రైస్తవ వాచ్ రాష్ట్ర నాయకురాలు గద్దె రతన శ్రీ, క్రైస్తవ హక్కుల పరిరక్షణ కమిటీ నాయకులు వద్దు ప్రేమ జ్యోతి బాబు, పాస్టర్ల సంఘం నాయకులు మార్క్ తదితరులు దీక్షాలను పర్యవేక్షించారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చు: గోనుగుంట్ల

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గ్రంథాలయాన్ని ఒక దేవాలయంగా భావించి వీలైనప్పుడల్లా గ్రంథాలయాన్ని సందర్శించాలని, తద్వారా విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు అన్నారు. స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని మహిళా బాలల గ్రంథాలయం నందు 'వేసవి విజ్ఞాన శిబిరాన్ని' గోనుగుంట్ల కోటేశ్వరరావు సోమవారం వైభవంగా ప్రారంబించారు. తొలుత గోనుగుంట్ల కోటేశ్వరరావు సరస్వతీదేవి విగ్రహానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంబించారు. అనంతరం ఆయన పుస్తక పఠనం, గ్రంథాలయాల ఆవశ్యకత గురించి విద్యార్థులకు వివరించారు. గోనుగుంట్ల మాట్లాడుతూ గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలన్నారు. గ్రంథాలయాల్లో పురాతన గ్రంథాలు అందుబాటులో ఉంటాయని, చరిత్ర గురించి మనకు లభ్యమయ్యే చోటు ఒక్క గ్రంథాలయం తప్ప మరెక్కడా అందుబాటులో ఉండదన్నారు. నేడు గ్రంథాలయాలకు వచ్చే విద్యార్థుల సంఖ్య, పాఠకుల సంఖ్య రోజురోజుకూ గణనీయంగా పడిపోతుందని ఆవేదన వ్యక్తంచేశారు. అనంతరం రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖ సంచాలకులు ఎ.కృష్ణమోహన్ మాట్లాడుతూ నేటి తరానికి డిజిటల్ లైబ్రరీలు ఎంతో ముఖ్యమని అన్నారు. పుస్తక పఠనం వల్ల మానసిక ఒత్తిడి తగ్గుతుందని, జాతీయ ఉద్యమ కాలంలో గ్రంథాలయాలు ప్రేరణగా నిలిచాయన్నారు. ప్రముఖ సాహితీవేత్త ఏవికె సుజాత మాట్లాడుతూ విద్యార్థులు అనునిత్యం గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలని, వారి భవిష్యత్, సమాజ అభివృద్ధి కోసం పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బారత్నమ్మ, రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సీహెచ్.దీక్షితులు, ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ సీనియర్ అసిస్టెంట్ మల్లంపాటి సీతారామయ్య, రిటైర్డ్ లైబ్రేరియన్ ఎస్ఎం సుభాని, అధ్యాపకులు శివారెడ్డి, మహిళా బాలల గంధ్రాలయ అధికారులు బి.శకుంతల, పి.సత్య శిరీష, గ్రంథాలయ సిబ్బంది, పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రధాని పర్యటనలో సమన్వయంతో పనిచేయాలి: కమిషనర్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : మే 2న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమరావతి పర్యటనకు సంబంధించి విధులు కేటాయించబడిన నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలియచేశారు. ప్రధానమంత్రి పర్యటన సందర్భంగా విధులు కేటాయించబడిన అధికారులు, సిబ్బందితో నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి పర్యటన సందర్భంగా సభా ప్రాంగణంలో ప్రధాన వేదిక, వీవీఐపీ వేదిక, కల్చరల్ వేదికలుగా మూడు వేదికలు ఏర్పాటు చేస్తున్నారని, వాటి వద్ద ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహించాలన్నారు. ఆరు పార్కింగ్ ఏరియాలను ఏర్పాటు చేస్తున్నారని వాటి వద్ద మౌలిక సదుపాయాలు, శానిటేషన్ నిర్వహించుటకు, గ్యాలరీలో పారిశుధ్య పనులు నిర్వహించుటకు అధికారులకు సిబ్బందికి ప్రత్యేకంగా విధులు కేటాయించుట జరిగిందన్నారు. విధులు కేటాయించబడిన అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా నిర్దేశిత గుర్తింపు కార్డు కలిగియుండాలన్నారు.